


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 274 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 11 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 274 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 11 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

### మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి

- హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఉద్రిక్తత
- మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాగ్వాదం
- గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే
- ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు
- ఇరువర్గాల నినాదాలతో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు

- మిగతా 2లో

## వర్షాల కోసం వరుణ యాగం..



### సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

- తెలంగాణలో వర్షాల కోసం ప్రభుత్వం మహా వరుణ యాగం
- నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు
- ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు
- యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం



**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయా లు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా

- మిగతా 2లో

## రెండేళ్లలో కేసీఆర్ సీఎం..

### పెద్ది కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటాం: మాజీమంత్రులు కేటీఆర్ , హరీశ్




**హైదరాబాద్ పెన్ పవర్:**రెండేళ్ళలో కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని..... ఏ నర్సంపేట మెడికల్ కాలేజీ కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రాణప్రదంగా తాపత్రపడ్డారో, ఆ కాలేజీకి ఆయన పేరును పెట్టి తీరుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సూర్యచంద్రులు ఉన్నంతకాలం నర్సంపేట చరిత్రలో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు కేటీఆర్. వరంగల్లో జరిగిన పెద్ది సుదర్శన రెడ్డి సంతాప సభలో మాట్లాడిన కేటీఆర్. . పెద్ది సుదర్శన్ రెడ్డి కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదు... గొప్ప అభ్యుదయవాది అని అన్నారు.

- మిగతా 2లో

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేం

### తెలంగాణకు కేంద్రం బ్యాడ్ న్యూస్




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రంలోని మోడీ సర్కార్ తెలంగాణకు మరోసారి బ్యాడ్ న్యూస్ చెప్పింది. తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్?కు జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పింది. ఆ ప్రాజెక్ట్?కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని తేల్చిచెప్పింది. ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ అప్రైజల్‌ను ప్రస్తుతం చేపట్టలేమని..

- మిగతా 2లో


## లొంగిపోయిన మావోయిస్టులకు అండగా ఉంటాం

### డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ లొంగిపోయిన మావోయిస్టులకు అండగా ఉంటుందని, వారికి అన్ని విధాలా సహాయం చేయడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉంటూ, వివిధ ప్రాంతాల్లో సేవలు అందించిన మావోయిస్టు కీలక నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి పోలీసుల ఎదుట లొంగిపోయారు.

- మిగతా 2లో



## కొలంబియాలో భారీ భూకంపం.. 69 మంది మృతి

- పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో భారీ భూకంపం
- ప్రకృతి విలయానికి 69 మందికి పైగా మృతి
- వేలాది భవనాలు నేలమట్టం, ఆరు విమానాశ్రయాలు మూసివేత
- బాధితులను ఆదుకుంటామని కొలంబియా అధ్యక్షుడి హామీ
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు ముమ్మరం

- మిగతా 2లో

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్.. ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!




- ఢిల్లీలోని ఫేక్ కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు
- తెలుగు మాట్లాడే యువతులనే టెలీకాలర్లుగా నియమించుకున్న కేటుగాళ్లు
- లోన్ల పేరుతో మోసం, 21 మంది యువతులతో పాటు వ్యక్తి అరెస్టు
- ప్రధాన సూత్రధారులు పరారీ, కొనసాగుతున్న దర్యాప్తు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మూడు మోసపూరిత కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బజాజ్ ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించి 22 మందిని

- మిగతా 2లో



## ఝార్ఖండ్‌లో టెన్షన్.. బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు..

### వాటర్ కేనన్‌ల ప్రయోగం

- ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం
- బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్
- అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు
- పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు
- 13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాటడంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో కనిపించింది. నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా

- మిగతా 2లో




## పన్నెండేళ్లలో రూ.10 లక్షల కోట్ల కార్పోరేట్ రుణాలు మాఫీ

**పెన్ పవర్ డెస్క్:**కార్పోరేట్ రుణాలు అంటే తెలిసే ఉంటుంది. పెద్దపెద్ద ప్రైవేటు కంపెనీలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలు. గత పన్నెండేళ్లలో బ్యాంకులు మాఫీ చేసిన కార్పోరేట్ రుణాలు 9 లక్షల 95 వేల కోట్ల రూపాయలు. అంటే దాదాపు పది లక్షల కోట్లు. కార్పోరేట్ లోన్స్ రైట్ ఆఫ్ లెక్కలు కేంద్ర ప్రభుత్వం 2026 ఆగస్టు 10న పార్లమెంటుకు తెలిపింది. కార్పోరేట్ రుణాలు మాఫీపై మాట్లాడుతూ.. పూర్తిగా రద్దు చేసనట్లు కాదని..

- మిగతా 2లో

## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

### యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన

- పన్నుల సవరణ బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం
- యూపీఐ లావాదేవీలపై వినియోగదారులకు ఛార్జీలు లేవని నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ
- మర్చంట్ డిస్కౌంట్ రేట్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్రం
- భవిష్యత్తులో ఛార్జీలు వచ్చినా వ్యాపారులకే, అదీ పెద్ద లావాదేవీలకే వర్తింపు
- రోజువారీ కొనుగోళ్లు 90 శాతం ఉచితంగానే కొనసాగుతాయని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారు లకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# తెలంగాణలో సర్వేల గుబులు.. రెండేళ్లకు ముందేనా?

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రధాన పార్టీలయిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లు ఇప్పటి నుంచే ప్రైవేట్ సంస్థల ద్వారా సర్వేలు నిర్వహిస్తుండటంతో అధికార, ప్రతిపక్ష శిబిరాల్లో టెన్షన్ నెలకొంది. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై వస్తున్న రహస్య సర్వే నివేదికలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. దీంతో అధికార పార్టీలో కలవరం రేగుతుంది. అదే సమయంలో ఈ సర్వేల్లో నిజమెంత? అబద్ధమెంత? అన్నది మాత్రం తెలియడం లేదు. తెలంగాణలో ఎన్నికలు జరగడానికి ఇంకా రెండేళ్లు సమయం ఉంది. జమిలీ ఎన్నికలు జరిగితే మూడేళ్ల తర్వాత కాని తెలంగాణలో ఎన్నికలు జరగవు.

**సర్వేలతో కలవరం...**

కానీ ముందే అనేక ప్రయివేటు సంస్థలు సర్వేలు నిర్వహిస్తు రాజకీయ పార్టీల్లో గుబులు రేపుతున్నాయి. అయితే ఇవి పెయిడ్ సర్వేలని తమకు అనుకూలంగా రాని పార్టీలు కొట్టిపారేస్తున్నా... ఎక్కడో ఏదో అనుమానం. ప్రజల్లో నిజంగా అసంతృప్తి ఉందా? అని అధికార పార్టీ, ప్రజల్లో తమ పార్టీకి అనుకూలత లేదా? అని విపక్ష పార్టీలు ఆందోళనలో పడ్డాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హామీల అమలు తీరుపై ప్రజల నుంచి వస్తున్న స్పందనను అంచనా వేయడానికి పార్టీలు సర్వేలు చేపట్టాయి.నియోజకవర్గాల్లో నిధుల కొరత, ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్న కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరు ఆశించదగ్గ రీతిలో లేదని సర్వేల్లో వస్తున్న టాక్ గుబులు పుట్టిస్తోంది.

**సర్వేలనే ప్రామాణికంగా...**

భవిష్యత్తులో టికెట్ల కేటాయింపునకు ఈ సర్వేలనే ప్రామాణికంగా తీసుకుంటారనే ప్రచారం నాయకుల్లో ఆందోళన కలిగిస్తోంది.రాజకీయ పార్టీల వ్యూహాలుఅధికార కాంగ్రెస్ పార్టీ తరపున అంతర్గత సర్వేల ద్వారా ప్రజాభిప్రాయాన్ని బేరీజు వేస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ , బీజేపీ కూడా గ్రౌండ్ రియాలిటీపై దృష్టి పెట్టాయి.ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాలు, ప్రజా స్పందన ఆధారంగా పార్టీల వ్యూహాలను మారుస్తున్నాయి. తమకు సానుకూలత, అననుకూలత ఏ నియోజకవర్గాల్లో అంచనా వేసుకుని వాటిని దిద్దుకునే ప్రయత్నంలో ఉన్నాయి. మొత్తం మీద రెండేళ్ల ముందే సర్వేలు తెలంగాణ రాజకీయ పార్టీల్లో కాక రేపుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

# వర్షాల కోసం వరుణ యాగం..

- మొదటి పేజీ తరువాయి

నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11 హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది సుమారు 518 అడుగుల వద్దే కొనసాగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిండి అన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు.

మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, మంత్రులు వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అబద్ధాలు చెప్పవద్దు.. కేవలం నిజాలే మాట్లాడండి. ఇది రాజకీయాలు చేసే వేదిక కాదు, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన చోటు" అని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మంత్రులపై ఆగ్రహం వెలిబుచ్చారు.ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# రెండేళ్లలో కేసీఆర్ సీఎం..

- మొదటి పేజీ తరువాయి

రాజకీయాలకతీతంగా నర్సంపేట ప్రజల కోసం పరితపించిన ఆ గొప్ప నేతను తలచుకుంటూ.. పెద్ది కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత బిఆర్ఎస్ పార్టీది. భవిష్యత్తులోనూ ఆ కుటుంబం వెంటే మా పార్టీ ఉంటుంది అని కేటీఆర్ భరోసానిచ్చారు. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన పెద్ది సుదర్శన రెడ్డి ఆశయాలు... నర్సంపేట గడ్డపై ఎప్పటికీ సజీవంగా ఉంటాయన్నారు కేటీఆర్. ప్రతి ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి పాత్ర చాలా కీలకం... ఆయన ఎంతో సాధారణ జీవితం గడిపిన గొప్ప నాయకుడని హరీశ్ రావు అన్నారు. పెద్ధితో కలిసి తాను పాల్గొన్న పురాతన దేవాలయ కార్యక్రమమే చివరిది అవుతుందని తాను అసలు ఊహించలేదని హరీశ్ రావు కంటతడి పెట్టుకున్నారు. ఈ ప్రభుత్వం ఆయనను ఎన్నో విధాలుగా భయపెట్టినా, ప్రలోభపెట్టినా ఏనాడూ తలొగ్గని ధీశాలి పెద్ది సుదర్శన్ రెడ్డి అని కొనియాడారు. ఆయనను బ్రతికించడం కోసం కేసీఆర్ చేసిన ప్రయత్నం అంతా ఇంతా కాదు అంటూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కష్టకాలంలోనూ, భవిష్యత్తులోనూ పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.

# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేం

- మొదటి పేజీ తరువాయి

కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు ట్రిబ్యునల్ పరిధిలో ఉందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో రావాలంటూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ డీపీఆర్‌ను కేంద్రం తిరిగిన వెనక్కి పంపింది. ప్రాజెక్టుకు కేంద్ర సాయం విషయంలోనూ తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ?ూూూ =జూూణ । 50 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా.. మావోయిస్టుల అడ్డా కర్రెగుట్టలో అధికారుల స్వేచ్ఛా తిరుగుబాటు: డీజీపీ సీవీ ఆనంద్

ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్య సభలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ జాతీయ హోదా గురించి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్?కు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ 2 పరిధిలో అంతర్రాష్ట్ర అంశాలు ఉండటంతో టెక్నో-ఎకనామిక్ అప్రైజల్ సాధ్యం కాదని, సమగ్ర ప్రణాళికతో డీపీఆర్?ను మళ్లీ సమర్పించాలని సూచించారు. ప్రాజెక్టుకు సాయం విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు.

# కొలంబియాలో భారీ భూకంపం.. 69 మంది మృతి

పశ్చిమ కొలంబియాలో సోమవారం సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో నమోదైన ఈ భూప్రకంపనల కారణంగా 69 మందికి పైగా మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. అనేక భవనాలు పేకమేడల్లా కూలిపోవడంతో శిథిలాల కింద ఇంకా చాలామంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం చోకో ప్రాంతంలోని శాన్ జోస్ డెల్ పల్మార్ పట్టణానికి సమీపంలో, భూమికి సుమారు 107 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. భూకంప తీవ్రతకు పెరీరా, కాలి, క్విబ్డో, మనీజల్స్ వంటి నగరాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్క పెరీరా నగరంలోనే 18 మంది మరణించినట్లు ఆ నగర మేయర్ మౌరిసియో సలాజర్ తెలిపారు. మనీజల్స్‌లోని చారిత్రక నియో-గోతిక్ కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. భూకంపం ప్రభావం పొరుగు దేశమైన ఈక్వెడార్‌లో కూడా కనిపించింది.

భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పెరీరా, మనీజల్స్, క్విబ్డో సహా ఆరు విమానాశ్రయాలు దెబ్బతిన్నాయి. దీంతో అధికారులు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. అనేక ప్రాంతాల్లో విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు స్తంభించాయి. రాజధాని బొగోటాలోని ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు.

**రంగంలోకి దిగిన ప్రభుత్వం**

కొలంబియా నూతన అధ్యక్షుడు అబెర్లార్డో డి లా ఎస్ప్రియెల్లా వెంటనే సహాయక చర్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నట్లు ప్రకటించారు. జాతీయ విపత్తు నిర్వహణ విభాగంలో యూనిఫైడ్ కమాండ్ పోస్ట్‌ను ఏర్పాటు చేసి, నష్టాన్ని అంచనా వేయాలని, బాధితులకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. తాను స్వయంగా భూకంప ప్రభావిత ప్రాంతమైన పెరీరాలో పర్యటించి, ప్రభుత్వ సహాయక చర్యలను సమీక్షిస్తానని ఎక్స్ వేదికగా తెలిపారు."ఈ కష్టకాలంలో ఉన్న కొలంబియా ప్రజలకు నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఒంటరి కాదు. ప్రభుత్వం మీకు అండగా ఉంది. ప్రభావిత ప్రాంతాల పునర్నిర్మాణానికి అవసరమైన ప్రతి చర్యా తీసుకుంటాం" అని అధ్యక్షుడు భరోసా ఇచ్చారు. కొలంబియాలో సాధారణంగా చిన్నపాటి భూప్రకంపనలు సంభవిస్తున్నప్పటికీ, 6.0 కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపాలు రావడం అరుదు.

# లొంగిపోయిన మావోయిస్టులకు అండగా ఉంటాం

- మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో సీవీ ఆనంద్ మాట్లాడుతూ... సుమారు 40 ఏళ్ల పాటు నల్లమల, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక అడవుల్లో మావోయిస్టుగా పనిచేసిన సమత లొంగిపోవడం చారిత్రాత్మక పరిణామమని అన్నారు. ఇదే సమయంలో, మరో కీలక నేత ముప్పల లక్ష్మణ్ రావు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారని, ఆయనతో పాటు ఆయన భార్య కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే మాజీ మావోయిస్టులకు హెల్త్ కార్డులు అందజేశామని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. లొంగిపోయిన సీనియర్ నేతలతో సమావేశమై వారి సమస్యలు, సూచనలను స్వీకరించామని, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని భరోసానిచ్చారు.పునరావాస పాలసీని అత్యంత సమర్థంగా అమలు చేస్తామని,

తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సీనియర్ నేతలకు సూచించినట్లు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావచ్చని, రాజకీయాల్లోకి కూడా రావొచ్చని ఆయన స్పష్టం చేశారు. వారిపై ఉన్న కేసుల అంశాన్ని కూడా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామన్నారు.

# ఝార్ఖండ్‌లో టెన్షన్.. బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు.. వాటర్ కేనన్‌ల ప్రయోగం

- మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల మార్చ్ నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలపై బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాంచీలో చాలా పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.

**16 రోజులుగా ఆందోళన**

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

# పన్నెండేళ్లలో రూ.10 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు మాఫీ

- మొదటి పేజీ తరువాయి

రికవరీ కొనసాగుతుందని పేర్కొంది. 2018-19లో అత్యధికంగా లక్షా 48 వేల 753 కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 20 వేల 485 కోట్ల రూపాయలు మాఫీ చేసినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ రాతపూర్వకంగా పార్లమెంటుకు తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం.. పెద్ద పరిశ్రమలకు ఔట్ స్టాండింగ్ లోన్లు 2025 ఆర్థిక సంవత్సరానికి 63 లక్షల19 వేల 57 కోట్ల రూపాయలు ఉండగా.. 2026 ఆర్థిక సంవత్సరానికి 69 లక్షల 21 వేల 734 కోట్ల రూపాయలకు పెరిగినట్లు తెలిపారు. మాఫీ అనేది అకౌంటింగ్ ప్రొసీజర్ మాత్రమేనని.. రుణ గ్రహీత కంపెనీలకు అది ఎలాంటి ఉపశమనం కాదని పేర్కొన్నారు. కార్పొరేట్ లోన్ల విషయంలో ఎన్డీఏ ప్రభుత్వంపై ఇప్పటికే విమర్శలు వస్తూనే ఉన్నాయి. మోదీ పగ్గాలు చేపట్టాక కార్పొరేట్ రుణాల మాఫీ ఎక్కువగా ఉందని పలు మార్లు ప్రతిపక్షాలు విమర్శలు చేసిన విషయం గమనార్హం. సామాన్యుల లోన్ల విషయంలో ముక్కు పిండి వసూళ్లు చేసే బ్యాంకులు.. కార్పొరేట్ల విషయంలో ఎందుకు ఉదాసీనత వహిస్తున్నాయనే ప్రశ్నలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

# తెలుగు అమ్మాయిలతో స్కెచ్.. ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!

- మొదటి పేజీ తరువాయి

అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 21 మంది తెలుగు యువతులు, ఒక బ్యాంకు ఖాతాదారుడు ఉన్నారు.

గత 18 నెలలుగా ఈ ముఠా చురుకుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులుగా ఫోన్లు చేసి, ఆకర్షణీయమైన రుణాలను ఆమోదించినట్లు నమ్మించేవారు. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజులు, వెరిఫికేషన్ చార్జీలు, డాక్యుమెంటేషన్, ఇన్సూరెన్స్ వంటి పేర్లతో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. ఈ మోసాలకు పాల్పడేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే యువతులనే నియమించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్ల, హైదరాబాద్‌లోని సైదాబాద్, బోరబండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి యువతులను టెలీకాలర్లుగా రిక్రూట్ చేసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు ఢిల్లీలోని శివ మార్కెట్ కేంద్రంగా ఈ కాల్ సెంటర్లను నడిపిస్తున్నారని, ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని అధికారులు తెలిపారు.ఈ ముఠాకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 22 సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సందర్భంగా 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన యువతుల వయసు 20 నుంచి 42 ఏళ్ల మధ్య ఉంది. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం గాలింపు ముమ్మరం చేశామని, మనీ ట్రయల్‌పై దృష్టి సారించి మోసం పూర్తి స్థాయిని అంచనా వేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం.. యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు.

గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు.మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు.భవిష్యత్తులో ఒకవేళ ఎండీఆర్‌ను ప్రవేశపెట్టినా, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన అధిక విలువ గల వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే స్పష్టం చేసింది. పాలు, కూరగాయలు, కిరాణా వంటి 90 శాతానికి పైగా రోజువారీ కొనుగోళ్లు వ్యాపారులకు కూడా ఉచితంగానే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ, 2020 జనవరి నుంచి ఉచిత సేవలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపు వ్యవస్థగా అవతరించింది.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

## క్వాంటమ్ స్కేప్ పరిశ్రమకు భట్టి ఆహ్వానం



**హైదరాబాద్ పెన్ పవర్:**విద్యుత్ వాహనాల(ఈవీ) బ్యాటరీల పరిశోధన, అభివృద్ధి(ఆర్ అండ్ డీ), విడి భాగాల తయారీ, సాంకేతికత యూనిట్లను తెలంగాణలో ఏర్పాటుకు పరిశీలించాలని క్వాంటమ్ స్కేప్ పరిశ్రమ అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన సోమవారం శాన్‌జోస్‌లోని బ్యాటరీ సాంకేతిక సంస్థ క్వాంటమ్ స్కేప్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ శివ శివరామ్ సహా ఉన్నతాధికారుల బృందంతో భేటీ అయ్యారు. తదుపరి తరం బ్యాటరీ సాంకేతికత, పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు. బ్యాటరీల అభివృద్ధిపై జరుగుతున్న పరిశోధనల వివరాలను డాక్టర్ శివరామ్ ఈ సందర్భంగా ప్రదర్శించారు. ప్రయోగశాల స్థాయి పరిశోధనలను వాణిజ్యపరంగా భారీస్థాయి తయారీకి తీసుకెళ్లడంలో ఎదురవుతున్న సవాళ్లను, సంస్థ సాధించిన ప్రగతిని ఉప ముఖ్యమంత్రికి వివరించారు. తెలంగాణలో విస్తరిస్తున్న విద్యుత్ వాహనాల వ్యవస్థ, హరిత ఇంధన రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని ఈ సందర్భంగా భట్టి తెలిపారు.




# బౌరంపేట్ 472లో... హెచ్చరిక బోర్డులు-ఫెన్సింగ్..!



బౌరంపేట్ సర్వే నెం.472 హౌసింగ్ బోర్డ్ స్థలంలో టిజిహెచ్‌బి హెచ్చరిక బోర్డు..

- 'టిజిహెచ్‌బి' స్థలంలో అక్రమార్కుల పాగా 'పెన్ పవర్' కథనంతో చర్యలు ప్రారంభం..
- సర్వే నెంబర్.472 టిజిహెచ్‌బి స్థలంలో 5 హెచ్చరిక బోర్డులు, ప్రీ కాస్ట్ ఫెన్సింగ్..

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

- ఈనెల 4న ప్రభుత్వ భూములకు రక్షణేది..?కబ్జాదారులకు అడ్డేది..? శీర్షిక..
- వెంటనే స్పందించిన టిజిహెచ్‌బి-రెవెన్యూ అధికారులు.. అదేరోజు కూల్చివేతలు..!
- ఈనెల 6న జాయింట్ సర్వేతో 21 ఎకరాలకు హద్దుల నిర్ధారణ..
- వరుస సెలవుల కారణంగా ఫెన్సింగ్-హెచ్చరిక బోర్డుల ఏర్పాటు పెండింగ్..
- సోమవారం (10న) 'ప్రీ కాస్ట్' సిమెంట్ పలకలతో ప్రహరీగోడ పనులు ప్రారంభం..
- వారం రోజుల్లో పకడ్బందీగా 'ప్రీ కాస్ట్' ఫెన్సింగ్ పనులు పూర్తయ్యే అవకాశం..!
- మరోవైపు కబ్జాదారులు, ఏదో ఒకరకంగా ఫెన్సింగ్ పెట్టకుండా ముమ్మర యత్నం..?
- ఓదశలో అసైనీలతో ప్రెస్‌మీట్ పెట్టేందుకు చేసిన ప్రయత్నం విఫలం..

బౌరంపేట్ సర్వే నెం.472 ప్రభుత్వ భూమిని 2024 నుండి రక్షించడానికి ఎప్పటికప్పుడు, కబ్జాలపై 'పెన్ పవర్' దినపత్రికలో వార్తా కథనాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళింది.. తెలంగాణ హౌసింగ్ బోర్డ్‌కు కేటాయించిన ఈ 21 ఎకరాల భూమిలో, రెవెన్యూ-టిజిహెచ్‌బి అధికారులు ఈనెల 6న, ఉమ్మడి సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించిన సంగతి తెలిసిందే.. అదేరోజు సాయంత్రం సమయం మించి పోవడంతో హెచ్చరిక బోర్డులు-ఫెన్సింగ్ ఏర్పాటుకు పెండింగ్ ఉండగా.. మరుసటి రోజు నుండి వరుసగా 3 రోజులు సెలవులు ఉండటం వలన.. సోమవారం(నిన్న) నుండి ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు.. కొత్తగా 5 హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 10:

-4లో

# భవిష్యత్తులో పిల్లలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వాలన్నదే మా లక్ష్యం




**హైదరాబాద్ పెన్ పవర్:**రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా పంటలు పండించామని ఆయన తెలిపారు. గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పిల్లలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి..భూభారతి ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూముల రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు.

మూడు, నాలుగు విడతల్లో వ్యవసాయ భూములతో పాటు మిగతా ఆస్తులను కూడా మ్యాపులతో సహా అందజేస్తామని, గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి స్వార్థం లేకుండా రైతుల కోసం పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన.. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీరు తక్కువగా వినియోగించే పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ పాతబస్తీలో సోమవారం రాత్రి సామూహిక మాతేశ్వరి ఘటాల నిమజ్జనోత్సవ ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. అంతకుముందు లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం, బేలా మాతేశ్వరి ముత్యాలమ్మ దేవాలయం, హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి మందిరం, ఉప్పుగూడ మహంకాళి, సుల్తాన్‌షాహి జగదాంబ, గౌలిపురా భారతమాత దేవాలయం.. తదితర ప్రధాన అమ్మవారి ఆలయాల్లో పోతరాజు స్వాగతం, భవిష్యవాణిని వినిపించే రంగం కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. భాగ్యనగర్ మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో మాతేశ్వరి ఘటాల ఊరేగింపు కనులపండువగా సాగింది. తిలకించడానికి నగరం నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఏపీ రాష్ట్రాల నుంచి జనం పెద్దఎత్తున తరలివచ్చారు. ఊరేగింపును నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనర్ ప్రారంభించారు. ఆకర్షణీయంగా అలంకరించిన శకటాలపై వివిధ దేవాలయాలకు చెందిన ఘటాలను నయాపూల్ దిల్లీ దర్వాజా సమీపంలోని మూసీనది మాతాఘాట్‌కు తీసుకువెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.




# తక్షణమే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయండి

## మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ




**హైదరాబాద్ పెన్ పవర్:** రైతుల ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లోని రిజర్వాయర్లు అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, నృసింహ(బస్వాపూర్) రిజర్వాయర్లను నింపి సుమారు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సోమవారం హరీశ్‌రావు లేఖ రాశారు. "ఇటు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షాలు, అటు రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 22 టీఎంసీల లభ్యత ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరిలో వరద నీటి లభ్యత ఏర్పడింది. వీటిని దృష్టిలో ఉంచుకొని వచ్చే వరదను ఒడిసిపట్టాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించాలి. అన్ని రిజర్వాయర్లు నింపి.. వాటికి అనుసంధానంగా నిర్మించిన చెరువులు, చెక్‌డ్యామ్‌లన్నింటినీ నింపి.. రైతుల్లో నెలకొన్న ఆందోళన తొలగించాలి" అని హరీశ్‌రావు కోరారు.

# పంద్రాగస్టు తర్వాత భాజపా ఉద్యమబాట




**హైదరాబాద్ పెన్ పవర్:** పార్టీ రాష్ట్ర నేతల మధ్య పూర్తిస్థాయి సయోధ్య కుదిరినట్టేనని... పంద్రాగస్టు తర్వాత ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలంతా కలిసి ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమ బాట పట్టనున్నామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... "నితిన్ నబీన్‌తో ఇటీవల దిల్లీలో అనేక విషయాలు చర్చించాం. రాష్ట్ర నేతల మధ్య సమన్వయం పూర్తిస్థాయిలో కుదిరినట్టే. బాలాపూర్, నాదర్‌గుల్‌లలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి. వాటిని కాపాడాల్సిన బాధ్యత హైడ్రాపై లేదా? మజ్లిస్ ఆస్తులపై కోర్టు చెప్పాక కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. 'క్యూర్' చట్టం తేవడం సామాన్యులపై భారం మోపడమే. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ గెలిచే అవకాశమున్న వారినే బరిలో నిలుపుతాం. పెట్రోల్‌లో ఇథనాల్ కలిపే విధానం యూపీఏ హయాంలోనే వచ్చింది. కానీ, ఇప్పుడు ఏ కారణంతో బండి మరమ్మతుకు గురైనా ఇథనాల్ వల్లే అని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు" అని పేర్కొన్నారు. అధ్యక్ష పదవి నుంచి మిమ్మల్ని మారుస్తారనే ప్రచారం జరుగుతోందని విలేకరులు ప్రశ్నించగా.. మరో రెండేళ్లు తానే ఉంటానని నవ్వుతూ బదులిచ్చారు. కార్యక్రమంలో భాజపా ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు పాల్గొన్నారు.




# బౌరంపేట్ 472లో... హెచ్చరిక బోర్డులు-ఫెన్సింగ్..!

- ‘టిజిహెచ్‌బి’ స్థలంలో అక్రమార్కుల పాగా ‘పెన్ పవర్’ కథనంతో చర్యలు ప్రారంభం..
- సర్వే నెంబర్.472 టిజిహెచ్‌బి స్థలంలో 5 హెచ్చరిక బోర్డులు, ప్రీ కాస్ట్ ఫెన్సింగ్..




బౌరంపేట్ సర్వే నెం.472 హౌసింగ్ బోర్డ్ స్థలంలో టిజిహెచ్‌బి హెచ్చరిక బోర్డు..

- ఈనెల 4న ప్రభుత్వ భూములకు రక్షణేది..?కబ్జాదారులకు అడ్డేది..? శీర్షిక..
- వెంటనే స్పందించిన టిజిహెచ్‌బి-రెవెన్యూ అధికారులు.. అదేరోజు కూల్చివేతలు..!
- ఈనెల 6న జాయింట్ సర్వేతో 21 ఎకరాలకు హద్దుల నిర్ధారణ..
- వరుస సెలవుల కారణంగా ఫెన్సింగ్-హెచ్చరిక బోర్డుల ఏర్పాటు పెండింగ్..
- సోమవారం (10న) ‘ప్రీ కాస్ట్’ సిమెంట్ పలకలతో ప్రహరీగోడ పనులు ప్రారంభం..
- వారం రోజుల్లో పకడ్బందీగా ‘ప్రీ కాస్ట్’ ఫెన్సింగ్ పనులు పూర్తయ్యే అవకాశం..!
- మరోవైపు కబ్జాదారులు, ఏదో ఒకరకంగా ఫెన్సింగ్ పెట్టకుండా ముమ్మర యత్నం..?
- ఓదశలో అసైనీలతో ప్రెస్‌మీట్ పెట్టేందుకు చేసిన ప్రయత్నం విఫలం..


**బౌరంపేట్ సర్వే నెం.472 ప్రభుత్వ భూమిని 2024 నుండి రక్షించడానికి ఎప్పటికప్పుడు, కబ్జాలపై ‘పెన్ పవర్’ దినపత్రికలో వార్తా కథనాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళింది.. తెలంగాణ హౌసింగ్ బోర్డ్‌కు కేటాయించిన ఈ 21 ఎకరాల భూమిలో, రెవెన్యూ-టిజిహెచ్‌బి అధికారులు ఈనెల 6న, ఉమ్మడి సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించిన సంగతి తెలిసిందే.. అదేరోజు సాయంత్రం సమయం మించి పోవడంతో హెచ్చరిక బోర్డులు-ఫెన్సింగ్ ఏర్పాటుకు పెండింగ్ ఉండగా.. మరుసటి రోజు నుండి వరుసగా 3 రోజులు సెలవులు ఉండటం వలన.. సోమవారం(నిన్న) నుండి ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు.. కొత్తగా 5 హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు..**

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగస్టు 10:

గండిమైసమ్మ-దుండిగల్ మండలం, బౌరంపేట్ సర్వే నెంబర్ 472లో తెలంగాణ హౌసింగ్ బోర్డుకు కేటాయించిన ప్రభుత్వ భూమి, పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు.. ‘టిజిహెచ్‌బి’కి కేటాయించిన సుమారు 21 ఎకరాల స్థలంలో అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు, హెచ్చరిక బోర్డులు, ప్రీ కాస్ట్ ఫెన్సింగ్ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి.. ప్రభుత్వ భూముల పరిరక్షణపై ‘పెన్ పవర్’ దినపత్రికలో 2024 నుంచి మూడేళ్ళుగా వరుసగా ప్రచురించిన కథనాల నేపథ్యంలో అధికారులు స్పందించి పలుమార్లు చర్యలకు శ్రీకారం చుట్టారు.. అయినప్పటికీ అక్రమార్కులు లేఅవుట్ సృష్టించి, వక్రమార్గంలో అమాయక పేద ప్రజలను టార్గెట్ చేసి దర్జాగా విక్రయించడంపై, ఈనెల 4న ప్రభుత్వ భూములకు రక్షణేది..?కబ్జాదారులకు అడ్డేది..? అన్న శీర్షికతో ‘పెన్ పవర్’ దినపత్రిక సంబంధిత అధికారులను అప్రమత్తం చేసింది.. దీంతో సర్వే నెం.472లో టిజిహెచ్‌బికి కేటాయించిన 21 ఎకరాల భూమిని రక్షించేందుకు “రెవెన్యూ, తెలంగాణ హౌసింగ్ బోర్డ్” అధికారులు ఈ నెల 6న ఉమ్మడి సర్వే నిర్వహించి హద్దులను నిర్ధారించారు.. అదే రోజు సమయం మించిపోవడంతో హెచ్చరిక బోర్డులు, ఫెన్సింగ్ ఏర్పాటు పనులు పూర్తికాకుండా నిలిచిపోయాయి.. అనంతరం వరుసగా మూడు రోజులు సెలవులు ప్రకటించడంతో, పనులకు కొంత విరామం ఏర్పడింది..

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

472లో ప్రీ కాస్ట్ ఫెన్సింగ్ పనులు..




బౌరంపేట్ సర్వే నెంబర్ 472లోని ప్రభుత్వ భూమి కబ్జాలపై ‘పెన్ పవర్’ దినపత్రిక ఎప్పటికప్పుడు కథనాలను ప్రచురిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ప్రభుత్వ భూమిలో జరుగుతున్న ఆక్రమణలు, ప్లాట్‌ల విక్రయాలు, భవిష్యత్‌లో ప్రభుత్వ ఆస్తి పరిరక్షణకు ఎదురయ్యే ముప్పుపై వరుస కథనాలు వెలువడ్డాయి.. ఈ క్రమంలో తెలంగాణ హౌసింగ్ బోర్డ్ అధికారుల చొరవతో, ‘టిజిహెచ్‌బి’కి కేటాయించిన 21 ఎకరాల స్థలంపై ‘దుండిగల్ తహశీల్దార్-టిజిహెచ్‌బి డీఈఈ ఆద్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించడం, అనంతరం హెచ్చరిక బోర్డులు, ప్రీ కాస్ట్ ఫెన్సింగ్ పనులు ప్రారంభించడం ప్రాధాన్యత సంతరించుకుంది.. ఏదిఏమైనప్పటికీ కబ్జాదారులు రాజకీయ నాయకుల అండతో మళ్ళీ అక్రమ నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉందని, ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అటు టిజిహెచ్‌బి- ఇటు దుండిగల్ రెవెన్యూ, అధికారులు, ఫీల్డ్ సిబ్బంది నిఘా ఏర్పాటు అవసరమని పేర్కొంటున్నారు..

## ‘ప్రీ కాస్ట్’ ఫెన్సింగ్..! 5 హెచ్చరిక బోర్డులు..!


తెలంగాణ హౌసింగ్ బోర్డ్‌కు కేటాయించిన బౌరంపేట్ సర్వే నెంబర్.472 భూమిలో ఈనెల (ఆగష్టు) 6న, నిర్వహించిన ఉమ్మడి సర్వేలో హద్దులు నిర్ధారించిన అధికారులు, సెలవులు ముగియడంతో సోమవారం (10న) ప్రీ కాస్ట్ సిమెంట్ పలకలతో ఫెన్సింగ్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. స్థలాన్ని పూర్తిస్థాయిలో రక్షించేలా ప్రహరీగోడ తరహాలో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు.. సదరు భూమి ప్రభుత్వ ఆధీనంలో (టిజిహెచ్‌బి) ఉందని స్పష్టం చేస్తూ కొత్తగా 5 హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.. ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించడం, ఆక్రమణలకు పాల్పడటంపై హెచ్చరికలు జారీ చేశారు.. పకడ్బందీగా చేపడుతున్న ఈ ‘ప్రీ కాస్ట్- ఫెన్సింగ్’ పనులు, వారం రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.. ఫెన్సింగ్ పూర్తయితే సర్వే నెం.472లోని ప్రభుత్వ భూమికి భౌతికంగా రక్షణ కల్పించినట్లు అవుతుంది..మరోవైపు, ఫెన్సింగ్ ఏర్పాటును ఎలాగైనా అడ్డుకునేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఒక దశలో అసైనీలను రెచ్చగొట్టి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేయాలన్న ప్రయత్నం కూడా విఫలమైనట్లు సమాచారం..



కొనసాగుతున్న ఫెన్సింగ్ పనులు..



బౌరంపేట్ గ్రామానికి వెళ్ళేదారిలో ఈ ఫెన్సింగ్ ప్రారంభం..



# ఒక్కడిని చేసి 12 మంది కొట్టారు.. శ్రీ చైతన్య స్కూల్లో విద్యార్థిపై తోటి సీనియర్ల అమానుషం..

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ లో దారుణం జరిగింది. స్థానిక శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థిపై 12 మంది సీనియర్ స్టూడెంట్స్ అమానుషంగా దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ శ్రీచైతన్య హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న కామారెడ్డికి చెందిన అభిషేక్ అనే విద్యార్థిపై కర్రలు, ప్లేట్లతో కొట్టి బూట్లతో ముఖంపై తొక్కి విచక్షణా రహితంగా దాడి చేశారు సీనియర్ విద్యార్థులు.


ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తమ కుమారుడు మెట్ల మీద నుంచి కిందపడిపోయాడంటూ స్కూల్ యాజమాన్యం తమకు ఫోన్ చేసి చెప్పారని, వెంటనే వెళ్లి తమ కొడుకును ఇంటికి తీసుకొచ్చామని తెలిపిన బాలుడి తల్లిదండ్రులు.ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు అభిషేక్.తనపై ర్యాగింగ్ పేరుతో సీనియర్ విద్యార్థులు దాడి చేశారని అభిషేక్ చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు తల్లిదండ్రులు. తమ కొడుకుపై దాడి చేసిన వారిపై, ఘటన బయటకు రాకుండా దాచిన స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు అభిషేక్ తల్లిదండ్రులు.





02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## 2026 ఆగస్టులో అరుదైన సూర్యగ్రహణం.. ఎప్పుడు, ఎక్కడ, ఎలా చూడాలి?



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 ఆగస్టులో అరుదైన సూర్యగ్రహణం ఏర్పడనుంది. దాదాపు 90 నుంచి 93 శాతం సూర్యుడు కనపడకుండా పోయే ఈ గ్రహణం చూసేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. అరుదైన గ్రహణంగా చెప్పుకునే ఈ సూర్యగ్రహణం.. ఆగస్టు 12న ఏర్పడనుంది.

ఈ అరుదైన సూర్యగ్రహణాన్ని ఇండియా నుంచి నేరుగా చూడలేం. ఇది స్విట్జర్లాండ్‌లో సంభవించనుంది. ఈ గ్రహణంలో ప్రదేశాన్ని బట్టి చంద్రుడు సూర్యుడిని సుమారు 90 నుంచి 93 శాతం వరకు కప్పివేస్తాడు. ఈ దృశ్యం సూర్యాస్తమయానికి దగ్గరగా జరుగుతుంది కాబట్టి, పశ్చిమ దేశాలలో చూడటానికి వీలవుతుంది.

**ప్రపంచవ్యాప్త మార్గం ఎలా ఉంటుంది?**

సంపూర్ణ సూర్యగ్రహణ మార్గం ఆర్కిటిక్ మహాసముద్రం మీదుగా ప్రారంభమై, గ్రీన్‌ల్యాండ్, ఐస్‌లాండ్‌ల మీదుగా వెళుతుంది. ఆ తర్వాత ఉత్తర స్పెయిన్, పోర్చుగల్‌లోని కొన్ని ప్రాంతాల మీదుగా కదులుతుంది. పశ్చిమ ఐరోపా, వాయువ్య ఆఫ్రికా, ఈశాన్య ఉత్తర అమెరికాలోని అనేక ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణం కనిపిస్తుంది.

**స్విట్జర్లాండ్‌లో నగరాల వారీగా కవరేజ్**

కేవలం స్విట్జర్లాండ్ నుంచి ఈ గ్రహణం చూసే వీలుండటంతో.. ఏ ఏ సిటీల్లో ఎంత మేరకు గ్రహణం ఏర్పడుతుందో డేటా ఈ కిందివిధంగా ఉంది.

జెనీవాలో సుమారు 92.7 శాతం ఏర్పడుతుంది. లౌసాన్లో 92.2 శాతం, బెర్న్: 91.4, బాసెల్ 90.8, జ్యూరిచ్: 90.6, సెయింట్ గాలెన్: 90.2 శాతంగా నమోదవుతుంది.

**చూసేందుకు ఉత్తమ ప్రదేశాలు**

వెస్టర్న్ హారిజాన్ అంటే పడమటి దిగంతం దగ్గర స్పష్టంగా కనిపించే ఎత్తైన ప్రదేశాలు ఉత్తమం. దిగంతం అంటే దిక్కు అంతం అయ్యే ప్రదేశం. అంటే భూమి ఆకాశం కలిసిపోయినట్లు అనిపించే రేఖ.

ప్రీ-ఆల్ప్స్, స్విస్ పీఠభూమిలోని కొన్ని భాగాలు చూసేందుకు మెరుగైన ప్రదేశాలు. సూర్యుడు దిగంతానికి కేవలం 3 డిగ్రీల ఎత్తులోనే ఉంటాడు. అందువల్ల పర్వతాలు, భవనాలు, చెట్లు అడ్డంకిగా మారవచ్చు. ముఖ్యంగా ఆల్పైన్ లోయల్లో జాగ్రత్తగా చూడాలి.

**స్విట్జర్లాండ్‌లో సంపూర్ణ సూర్యగ్రహణం ఉంటుందా?**

స్విట్జర్లాండ్ లో కూడా సంపూర్ణ గ్రహణం ఉండదు. చంద్రుడు సూర్యుని 90 శాతానికంటే ఎక్కువ భాగాన్ని కప్పడం వల్ల సన్నని నెలవంక ఆకారంలో సూర్యుడు కనిపిస్తాడు. సంపూర్ణ గ్రహణం గ్రీన్‌ల్యాండ్, ఐస్‌లాండ్, ఉత్తర స్పెయిన్‌లలో మాత్రమే కనిపిస్తుంది.

**కళ్లు జాగ్రత్త:**

సూర్యగ్రహణాన్ని చూసేటప్పుడు తప్పనిసరిగా xూా -ధృవీకరించిన సూర్యగ్రహణ కళ్ళద్దాలు (సోలార్ ఎక్లి?ప్స్ గ్లాసెస్) లేదా సురక్షితమైన ఇండైరెక్ట్ పద్ధతులు ఉపయోగించాలి. సరైన కంటి రక్షణ లేకుండా సూర్యుడిని నేరుగా చూడటం వల్ల కంటికి శాశ్వత నష్టం కలగవచ్చు.

## బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

**హైదరాబాద్ పెన్ పవర్:** నర్సంపేటలో దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు నిర్మించిన గద్దెను మున్సిపల్ అధికారులు కూల్చివేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. సోమవారం నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ నేత మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి నర్సంపేట నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గద్దె కూల్చివేతను నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ప్రజా సేవ చేసిన దివంగత నేత పెద్ది సుదర్శన్రెడ్డి స్మారకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మించిన గద్దెను మున్సిపల్ అధికారులు కూల్చివేయడం సరికాదన్నారు. ప్రజల మనోభావాలను గౌరవించాలని డిమాండ్ చేశారు.

## మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్ సమీపంలో తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన థార్ వాహనం, ద్విచక్ర వాహనాన్ని వేనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద ఘటనలో బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు వనపర్తి జిల్లాకు చెందిన చెల్లా శ్రీనివాసులు (50) గా గుర్తించారు. ప్రమాదంలో బైక్ నడుపుతున్న శివకుమార్కు స్వల్ప గాయాలు అయ్యాయి. శ్రీనివాస్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హస్పటల్ కు తరలించారు. మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆదాయంలో ముందంజ అభివృద్ధిలో వెనకంజ!

**టికెట్ల రూపంలో ఆదాయం**
**కనీస వసతులకు మాత్రం దూరం**



గార్ల రైల్వే స్టేషన్

### కనీసం కూర్చునే సదుపాయం లేదు: ప్రయాణికుడు ఈశ్వర్ లింగం



ప్రయాణికుడు ఈశ్వర్ లింగం

రైలు కోసం కొంతసేపు వేచి ఉండాల్సి వస్తే కూర్చోవడానికి సరైన బెంచీలు కూడా లేక ఇబ్బంది పడుతున్నాం. వృద్ధులు, మహిళలు, పిల్లల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు పెంచాల్సిన అవసరం ఉంది తగినంత వెలుతురు లేక రాత్రి సమయంలో మహిళలు చిన్నారులు వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వర్షాకాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుందని ఆయన అన్నారు.

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 10:**
రైల్వేకు ఆదాయం సమకూర్చడంలో ముందున్న గార్ల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మాత్రం కనీస సౌకర్యాలు కరువయ్యాయి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నా స్టేషన్ అభివృద్ధిపై అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి నిత్యం వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులతో రద్దీగా ఉండే స్టేషన్ లో కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### మరుగుదొడ్లు, పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలి: సిపిఎం పార్టీ మండల కార్యదర్శి అలవాల సత్యవతి



సిపిఎం పార్టీ మండల కార్యదర్శి అలవాల సత్యవతి

స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపరచాలని ముఖ్యంగా మరుగుదొడ్లు, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. రైలు కోసం వేచి ఉండే సమయంలో మహిళలు వృద్ధులు అనేక రకాలుగా ఇబ్బందు లు పడుతున్నారని
ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా స్టేషన్ ను అభివృద్ధి చేయాలని పలుమార్లు కోరినా సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు.

### ఆదాయం వస్తోంది.. అభివృద్ధి ఏది: సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కందునూరి శ్రీనివాస్



సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కందునూరి శ్రీనివాస్

ప్రయాణికుల నుంచి టికెట్ల రూపంలో ఆదాయం వస్తున్నప్ప టికీ అందుకు అనుగుణంగా స్టేషన్లో సౌకర్యాలు మెరుగు పడటం లేదని ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా గార్ల స్టేషన్‌ను అభివృద్ధి చేసి కనీస వసతులు
కల్పించేందుకుఅధికారులు ఈ స్టేషన్ పై దృష్టి సారించాలిని గార్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ రైల్వే స్టేషన్‌ను వినియోగిస్తున్నారని ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు, వెలుతురు, పరిశుభ్రత తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని ఆదాయం తీసుకోవ డంలో చూపుతున్న శ్రద్ధను.. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం లోనూ చూపాలని రైల్వే అధికారులను ఆయన కోరారు.




పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న ప్లాట్ ఫారం



బెంచీలు లేని ప్లాట్ ఫారం

## ప్రియాంక తండ్రిని ఓదార్చిన మంత్రి వాకిటి

**హైదరాబాద్ పెన్ పవర్:** గాంధీ ఆస్పత్రిలోని మార్చురీలో మెడికో విద్యార్థి ప్రియాంక భౌతికకాయానికి మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ తదితరులు నివాళులు అర్పించారు. మంత్రి వాకిటి శ్రీహరి ప్రియాంక తండ్రిని ఓదార్చి ధైర్యం చెప్పారు.మంత్రి మాట్లాడుతూ ప్రియాంక ఘటన అత్యంత దురదృష్టకరం. ప్రియాంక మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి మాకు, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు జరుగకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవడం ఆవశ్యకరమని అన్నారు.ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. చట్టాల్లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకొని తప్పించుకోకుండా కఠినంతరం చేయాలని అన్నారు.

## నిజాయితీ చాటుకున్న మేడ్చల్ బస్ డిపో సిబ్బంది

**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రయాణికుడు బస్సులో మరిచిపోయిన విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను గుర్తించి సురక్షితంగా తిరిగి అప్పగించి మేడ్చల్ టీజీఎస్ఆర్టీసీ డిపో సిబ్బంది నిజాయితీని చాటుకున్నారు. శనివారం మేడ్చల్ డిపోకు చెందిన 215/2 సర్వీస్ బస్సు పటాన్‌చెరువు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తుండగా కేపీహెచ్‌బీ వద్ద ప్రశాంత్ అనే ప్రయాణికుడు బ్యాగ్‌తో బస్సు ఎక్కి, రాత్రి 1.15 గంటలకు ప్యాట్ని వద్ద దిగిపోయారు. అనంతరం బస్సు తిరుగు ప్రయాణంలో ఉండగా కండక్టర్ గోవింద్ బ్యాగ్‌ను గుర్తించి డిపో అసిస్టెంట్ మేనేజర్ జ× జి. రామారావు, విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించారు. బ్యాగ్‌లో సుమారు రూ.2 లక్షల నగదు, ఆపిల్ ల్యాప్‌టాప్, రెండు పర్సులు, చార్జర్,
దుస్తులు, ఆఫీస్ ఐడీ కార్డు తదితర వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. బ్యాగ్‌లోని కాంటాక్ట్ నంబర్ ద్వారా ప్రశాంత్‌ను సంప్రదించి, డిపోకు పిలిపించి అతని సమక్షంలో వస్తువులన్నింటినీ పరిశీలించి సురక్షితంగా తిరిగి అప్పగించారు. దీంతో ప్రయాణికుడు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ కి వినతి

**గార్ల పెన్ పవర్ ఆగస్టు 10:**

గార్ల మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు జడ సత్యనారాయణ సోమవారం మహబూబాబాద్ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. గార్ల మండల వ్యాప్తంగా ఉన్న 20 గ్రామ పంచాయతీల ప్రజలు విద్యార్థులు ఉద్యోగులు రైతులు వృద్ధులు మహిళలు విద్యా వైద్యం ఉపాధి ఇతర అత్యవసర అవసరాల కోసం ఖమ్మం మహబూబాబాద్ పట్టణాలకు వెళ్లేందుకు ప్రతినిత్యం మండల కేంద్రమైన గార్లకు రావడం జరుగుతుందని గ్రామం నుండి బయటకు వెళ్లాల్సి వచ్చిన ప్రతిసారి వెళ్లేందుకు రవాణా సదుపాయం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా సీతంపేట పెద్ద కిస్టాపురం చిన్న కిస్టాపురం సత్యనారాయణపురం మర్రిగూడెం పుల్లూరు శేరిపురం గోపాలపురం పోచారం గ్రామాల ప్రజలు రవాణా మార్గం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆటోల ద్వారా ద్విచక్ర వాహనాల ద్వారా గార్ల రైల్వే స్టేషన్ కు వచ్చి ఖమ్మం మహబూబాబాద్ పట్టణాలకు వెళ్ళవలసి వస్తుందన్నారు ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని

మహబూబాబాద్ నుంచి ఖమ్మం వరకు ఖమ్మం నుంచి మహబూబాబాద్ కు ప్రతినిత్యం ఉదయం మధ్యాహ్నం సాయంత్రం వేలల్లో సాధారణ ఎక్స్ ప్రెస్ ప్రభుత్వ బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు వస్తే గార్ల మండల గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలపగా డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. వినతి పత్రం



డిపో మేనేజర్ కి వినతిపత్రం ఇస్తున్న న్యూ డెమోక్రసీ నాయకులు

అందించిన వారిలో న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి సక్రు డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు మండల నాయకులు మట్టపల్లి వీరభద్రం గోసు బజారు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# సీపీఐ బలోపేతం కోసమే గ్రామ శాఖల కమిటీలు



జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా నాయకులు విజయసారథి

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 10:** సీపీఐ పార్టీ బలోపేతం కోసమే గార్ల మండలంలో గ్రామాల వారీగాగ్రామ శాఖ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి అన్నారు.ప్రచార యాత్రలో భాగంగా గార్ల మండల పరిధిలోని ముత్తి తండా మర్రిగూడెం గ్రామాలలో సిపిఐ పార్టీ ఏర్పాటు చేసిన నూతనంగా గ్రామ శాఖ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం

జిల్లా నాయకులు విజయ సారథి సిపిఐ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 6 నుండి 14 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రచార యాత్రలు జరుగుతున్నాయి. నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అభివృద్ధి ఉపాధి సంక్షేమం సుపరిపాలన మరియు మెరుగైన భవిష్యత్తును అందిస్తామని వాగ్దానం చేసింది కానీ దానికి బదులుగా దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం భరించలేని ద్రవయోల్బణం ధరల పెరుగుదల విస్తరిస్తున్న అసమానతలు బలహీనపడుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుశించుకుపోతున్న ప్రజాస్వామ్యం మరియు పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తలను ఎదుర్కొంటుందని అయినప్పటికీ మోడీ ప్రభుత్వం నుండి ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలని కోరినప్పుడల్లా ఈ చర్చను ఇతర అంశాల వైపునకు మళ్లిస్తున్నారన్నారు సామాన్య పౌరుల రోజువారి సమస్యలను పరిష్కరించడానికి బదులుగా బిజెపి ఆర్ఎస్ఎస్ పదేపదే మతపరమైన ధృవీకరణ మానసిక విజ్ఞప్తులు సృష్టించబడిన వివాదాల వైపు మొగ్గు చూపుతున్నాయని జవాబుతారితనం నుండి తప్పించుకోవడానికి మతాన్ని వాడుకుంటున్నారని యువత పోటీ పరీక్షల కోసం ఏళ్ల తరబడి సన్నద్ధమవుతుంటే నియామకాలు ఆలస్యం కావడం రద్దు కావడం వరుస పేపర్ లీకేజీల వల్ల పక్క దారి పట్టడం వంటివి జరుగుతున్నాయన్నారు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ కాకుండా అలాగే ఉండిపోతుంటే శాశ్వత సురక్షితమైన ఉద్యోగాల స్థానంలో ఒప్పంద కాంట్రాక్టు ఉద్యోగాలు వచ్చి చేరుతున్నాయి చదువుకున్న యువత చేతిలో డిగ్రీలు ఉన్నప్పటికీ వారి ఆకాంక్షలను తగ్గ అవకాశాలు లభించకపోవడంతో ఒక పరీక్ష నుండి మరో పరీక్షకు తిరుగుతూనే ఉన్నారు చదువు తమ పిల్లల భవిష్యత్తును సురక్షితం చేస్తుందని ఆశతో కుటుంబాలు తమ పొదుపు మొత్తాన్ని పెట్టుబడిగా పెడుతున్నాయి కానీ దానికి బదులుగా లెక్క లేనంత మంది భారతీయ యువత తీవ్ర నిరాశకు గురవుతూ నిరుద్యోగ మారుతూ తమ రేపటి భవిష్యత్తు గురించి నీ స్థితితో మిగిలిపోతున్నారు బిజెపి ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యాల్లో ఉద్యోగం ఒకటి అనే నిజాన్ని ఎంతటి ప్రచారం కూడా దాచలేని పరిస్థితి దేశంలో నెలకొంది అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనియెడల దశల వారి ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. సిపిఐ చేపడుతున్న ప్రచార యాత్రలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, నాయకులు భూక్య హరినాయక్, రాగం రమేష్, మెదరమెట్ల గిరిప్రసాద్, కృష్ణమూర్తి, మాగం లోకేష్, భూక్య పుల్ సింగ్, మంగీలాల్, లక్ష్మి, సొమ్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై జైలు భరో



రోడ్డు పై బైటాయించిన కార్మికులు, రైతులు



మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు,రైతులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 10:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారం చేపట్టాక నిత్యవసర వస్తువులు ధరలు హద్దు అదుపు లేకుండా పెరిగాయని, కార్మికులు, కర్షకులు, పేదలు, రైతుల జీవితం చిన్నబిన్నం అవుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందుకు తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి విబిజి రాంజీ చట్టాన్ని తీసుకురావడం వలన ప్రజలకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాట్లు ధరలు లేక మార్కెట్ లో తక్కువ ధరకే అమ్ముకొని రైతులు దివాలా తీసే పరిస్థితి దాపురించిందని, యూరియా, పురుగు మందుల ధరలు రెట్టింపుగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లుగా ఎంతోమంది ప్రాణాలు ఇచ్చి పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాలరాసేందుకు 4 లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. ఆకాశాన్ని తాకే విధంగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని, భారత్ అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా స్థానిక సిఐటియు కార్యాలయం నుండి భారీ ప్రదర్శన, నెహ్రూ సెంటర్లో మానవహారం నిర్వహించి రోడ్డుపై బైటాయించి ఆందోళన చేపట్టారు. సుమారుగా మూడు గంటల పాటు జరిగిన ఈ ఆందోళన తో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. ఆందోళన వద్దకు చేరుకున్న ఎస్ఐబి సాయికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది ఆందోళనకారులను అరెస్టు లు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ప్రజానాట్యమండలి కళాకారుల ఆట పాటలతో నిర్వహించిన ఈ జైలు భరో కార్యక్రమం కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలతో నెహ్రూ సెంటర్ ప్రాంగణం దద్దరిల్లింది. ఈ కార్యక్రమంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సిహెచ్ మౌనిక, ఏ వీరస్వామి, ఐ.గోవిందు, బి ఉపేందర్ రెడ్డి, విపి వెంకటేశ్వర్లు, ఎం నాగమణి, సిహెచ్ ఎల్లయ్య, కె.రామకృష్ణ, జే సత్యం, కై బాబు, శ్రీను, అంగన్వాడి,ఆశ వర్కర్స్, గ్రామపంచాయతీ, ఆటో కార్మిక, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, డివైఎఫ్ఐ,ఎస్ఎఫ్ఐ నాయకులు వీ కొండయ్య,బి శివకృష్ణ లు మద్దతు తెలిపి ఆందోళన లో పాల్గొన్నారు.



పోలీస్ ల అదుపులో ఉన్న నాయకులు

# రైతుల తీర్పును ఎదుర్కోండి



బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 10:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పిఎసిఎస్ ప్రభుత్వం దూరంగా ఉండటంపై బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ శీలం శెట్టి రమేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతుల ఓటు హక్కును పక్కనపెట్టి నామినేటెడ్ విధానంలో పదవులను భర్తీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రైతులపై నమ్మకం ఉంటే ఎన్నికలు నిర్వహించి వారి తీర్పును స్వీకరించాలని సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను కాపాడటంలో పిఎసిఎస్ లు కీలకపాత్ర పోషిస్తున్నాయని సభ్యత్వం, వాటా హక్కులు, ఓటు హక్కుల ఆధారంగా రైతులు తమ ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం ఉండాలని డైరెక్టర్లు, చైర్మన్, వైస్‌చైర్మన్ పాలకవర్గాలను ఎన్నికల ద్వారా ఎన్నుకోవడం వల్లే సహకార వ్యవస్థకు ప్రజాస్వామ్య బలం చేకూరుతుందని తెలిపారు.

**రైతుల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేదా?**

ఎన్నికల సమయంలో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై రైతుల్లో అసంతృప్తి ఉందనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో సహకార సంఘం ఎన్నికలకు ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందని రమేష్ ప్రశ్నించారు. రైతుల తీర్పును ఎదుర్కొనే భయం ఉందని అందుకే ఎన్నికలను పక్కనపెట్టి దొడ్డిదారిన పదవులను పంచుతున్నారా అని నిలదీశారు.

ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని, రైతులపై విశ్వాసం ఉంటే ఎన్నికలు నిర్వహించి వారి ఓట్లతో పాలకవర్గాలను ఎన్నుకోవాలని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నామినేషన్ల ద్వారా పదవులను భర్తీ చేయడం ఎన్నికలకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు.

**సహకార సంఘాలను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చొద్దు**

ప్రాథమిక సహకార సంఘాలు ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందిన సంస్థలు కావని, అవి రైతుల సొంత వ్యవస్థలని రైతుల సభ్యత్వం, వాటా సొమ్ము, కష్టంతో ఏర్పడిన సహకార సంఘాల్లో రాజకీయ జోక్యాన్ని పెంచడం సరికాదన్నారు.

**రైతులే పాలకవర్గాలను ఎన్నుకునేలా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి.**

నామినేటెడ్ పదవుల పేరుతో రైతుల ఓటు హక్కును హరించే ప్రయత్నాలను తాము వ్యతిరేకిస్తామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పిఎసిఎస్ ఎన్నికలపై స్పష్టత ఇవ్వాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి రైతులకు తమ ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం కల్పించాలని శీలం శెట్టి రమేష్ డిమాండ్ చేశారు.

# బిగ్ ప్లాన్ లో బీజేపీ

**హైదరాబాద్, ఆగస్టు 10, పెన్ పవర్:**

తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత పట్టు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కమలనాథులు, ఈసారి ఎలాగైనా తెలంగాణ గద్దెనెక్కాలనే స్పష్టమైన దిశానిర్దేశంతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో జరిగిన కీలక సమీక్షా సమావేశం, రాబోయే రోజుల్లో బీజేపీ అనుసరించబోయే రాజకీయ వ్యూహానికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది.తెలంగాణ బీజేపీకి ప్రధాన ప్రతిబంధకంగా మారిన పాత, కొత్త నేతల మధ్య విభేదాలను, అంతర్గత కలహాలను వెంటనే పక్కన పెట్టాలని పార్టీ అధిష్ఠానం స్పష్టం చేసింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, రఘునందన్ రావు సహా ముఖ్య నేతలందరూ ఒకే తాటిపైకి వచ్చి పోరాడాలని అధిష్టానం స్పష్టం చేసింది. గతంలో కరీంనగర్, మేడ్చల్ అర్బన్, వికారాబాద్ జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకంపై నలుగుతున్న వివాదాలను సైతం బండి సంజయ్, ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డిల సూచనలకు ప్రాధాన్యం ఇస్తూ సర్దుబాటు చేయడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఐక్యతను నింపే ప్రయత్నం జరిగింది.భవిష్యత్తులో బిఆర్ఎస్ లేదా ఇతర పార్టీలతో పొత్తులు ఉంటాయనే ప్రచారాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముగింపు పలికారు. రాబోయే ఎన్నికల్లో జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికల్లోనైనా తెలంగాణలో ఏ ఇతర పార్టీతోనూ పొత్తు ఉండదని, ఒంటరిగానే పోటీ చేస్తామని తేల్చి చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో సమీకరణాలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ స్వయం సమృద్ధి దృష్ట్యా ఒంటరి పోరాటమే శ్రేయస్కరమని పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో గణనీయమైన ఓటు బ్యాంకు సాధించామని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం సీట్ల సంఖ్య పెరిగితే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత సత్తా సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, యువత సమస్యలపై పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ధర్నాలు, నిరసనలు చేపడుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' వంటి ఫలాలను పేదలకు చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు.మండల స్థాయి నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ప్రతి నెలా నిలకడగా సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతీ మూడు నెలలకోసారి కేంద్రీయ నేతలు రాష్ట్రాన్ని సందర్శించేలా పక్కా ప్రణాళిక రూపుదిద్దుకుంది. నేతల మధ్య ఉన్న చిన్న చిన్న భేదాభిప్రాయాలు పక్కనబెట్టి, వ్యూహాత్మకంగా ముందుకు సాగితే తెలంగాణ పీఠం దక్కడం అసాధ్యమేమీ కాదని కమలనాథులు భావిస్తున్నారు.

**బండి సంజయ్ నివాసంలో సమావేశాలు..**

బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాజకీయాల్లో మరో మలుపు తీసుకుంటూ వ్యూహాత్మకంగా కదులుతోంది. ఒకవైపు వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్, గుజరాత్‌లో గెలుపుపై దృష్టి సారించిన కమలం పార్టీ మరోవైపు దరక్షిణాన పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటక తర్వాత గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో పార్టీలో జోష్ పెంచడంతోపాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేలా వ్యూహాలు రూపొందిస్తోంది. త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ పోరులో విజయం సాధించాలనే లక్ష్యంతో కేంద్ర స్థాయి నుంచి స్పష్టమైన దిశానిర్దేశం జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీని వేదికగా రాష్ట్ర నాయకుల సమావేశాలు జరగడం, పార్టీలో సమన్వయాన్ని పెంచే ప్రయత్నాలు ఈ వ్యూహానికి ప్రధాన అంశాలుగా మారాయి.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ బలమైన పనితీరు చూపాలనే ఆలోచనతో బీజేపీ అధిష్టానం పని చేస్తోంది. హైదరాబాద్‌లోని మున్సిపల్ ఎన్నికలు పార్టీకి కీలక పరీక్షగా మారనున్న నేపథ్యంలో, రాష్ట్ర స్థాయి నాయకత్వం, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత బలం పెంచే దిశగా చర్చలు సాగుతున్నాయి. కేవలం ఎన్నికల క్యాంపెయిన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక రాజకీయ బలాన్ని నిర్మించే దృష్టితో వ్యూహాలు రూపొందుతున్నట్లు అర్థమవుతోంది.ఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం రాష్ట్ర నాయకుల సమావేశాలకు ముఖ్య వేదికగా మారింది. ఇక్కడ జరుగుతున్న చర్చలు కేవలం సాధారణ సమావేశాలుగా కాకుండా, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలకు దారితీస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులు, కేంద్ర నాయకత్వం మధ్య నేరుగా సంప్రదింపులు జరగడం వల్ల సమస్యలను త్వరగా గుర్తించి, పరిష్కార మార్గాలు చర్చించే అవకాశం ఏర్పడుతోంది. ఇది పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించే దిశగా ఉన్నట్లు కనిపిస్తోంది.పార్టీలోని వర్గ విభేదాలను అధిగమించి, ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశం అధిష్టానం నుంచి స్పష్టంగా వస్తోంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో జరిగిన చర్చల్లో ఈ అంశం ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయం సాధించాలంటే అంతర్గత సమస్యలు అడ్డంకిగా మారకూడదనే అవగాహనతో, నాయకుల మధ్య సమన్వయం పెంచే చర్యలు చేపట్టబడుతున్నాయి. ఇది పార్టీ సంస్థాగత బలాన్ని పెంచి, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవకాశం కలిగిస్తుంది.ఢిల్లీలో జరుగుతున్న ఈ కదలికలు తెలంగాణలో బీజేపీ స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసే ప్రయత్నంగా భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు అంతర్గత ఐక్యతను నిర్ధారించుకోవడం, స్పష్టమైన బాధ్యతల పంపిణీ, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం వంటివి ఇప్పుడు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ వ్యూహం ఎంతవరకు ఫలితాలు ఇస్తుందనేది రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షాల పనితీరు, ప్రజా స్పందనపై ఆధారపడి ఉంటుంది. అయితే అధిష్టానం స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడం, సమన్వయాన్ని ప్రోత్సహించడం పార్టీకి సానుకూల సంకేతంగా నిలుస్తోంది.మొత్తంమీద ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ చర్చలు, సమావేశాలు తెలంగాణలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల లక్ష్యం, అంతర్గత ఐక్యత, సంస్థాగత సమన్వయం ఈ మూడు అంశాలపై దృష్టి సారించి అధిష్టానం ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

# 95 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ కు గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, ఆగస్టు 10, పెన్ పవర్:**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటులో కీలక ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 టీపీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటికే తొలి మోడల్ పాఠశాలగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో ఏర్పాటు చేసిన స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందించేలా సదుపాయాలు కల్పించారు. తాజాగా మరో 95 పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. వీటి నిర్మాణానికి మొత్తం రూ.928 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో పాఠశాలకు భూమి, భవన పరిమాణం, మౌలిక సదుపాయాలను బట్టి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఖర్చు కానుంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపించారు. 95 పాఠశాలల నిర్మాణాలకు అవసరమైన పరిపాలనా అనుమతుల కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యమంత్రి ఆమోదం అనంతరం ఉత్తర్వులు వెలువడితే టెండర్ల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా 2027-28 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలన్న నిర్ణయం నేపథ్యంలో టీపీఎస్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ పాఠశాలలకు అవసరమైన నిధుల్లో 70 శాతం, అంటే సుమారు రూ.650 కోట్లను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణం ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మిగిలిన 30 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనున్నారు. విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏఐఐబీ, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి భారీగా రుణాలు సమీకరించే ప్రణాళికలో భాగంగానే ఈ నిధులను వినియోగించనుంది. రుణం అందడంలో ఆలస్యం ఏర్పడినా పనులు ఆగిపోకుండా రాష్ట్ర నిధులతో తొలిదశ నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ఏఐఐబీ తరఫున కన్సల్టెన్సీ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ సంబంధిత అధికారులతో ప్రాజెక్టు అమలు, మౌలిక సదుపాయాలు, నిర్మాణ ప్రమాణాలపై చర్చలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. టీపీఎస్‌లను కేవలం పాఠశాల భవనాలుగా కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించేలా మౌలిక వసతులు కల్పించనున్నారు. తరగతి గదులతోపాటు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, లైబ్రరీలు, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలను కల్పించనున్నారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే ఆధునిక తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, క్రీడా వసతులు, ఉచిత రవాణా వంటి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించడంతోపాటు పాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇప్పటికే అచ్చంపేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు రెండేసి టీపీఎస్‌లు మంజూరు కాగా.. గజ్వేల్‌కు కూడా పాఠశాలను కేటాయించారు. ఆరుట్లలో ప్రారంభమైన తొలి టీపీఎస్ నమూనాగా మిగిలిన పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా 100 టీపీఎస్‌ల ఏర్పాటుతో ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంచి, పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది

# తెలంగాణ కేబినెట్ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్..

**హైదరాబాద్, ఆగస్టు 10, పెన్ పవర్:**
తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతోపాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే, కేబినెట్ నుంచి ఒకరికి ఉద్వాసన పలుకుతారని గతంలో ప్రచారం జరిగినప్పటికీ.. ప్రస్తుతం ఆమేరకు అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం అందరిలో ఉత్కంఠ నెలకొంది. పక్క రాష్ట్రమైన కర్ణాటలో మంత్రివర్గ విస్తరణ పూర్తయిన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తన ఫోకస్‌ను తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పెట్టినట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. పలువురు సీనియర్, జూనియర్ ఎమ్మెల్యే మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వాలంటూ ఇప్పటికే పలు దఫాలుగా కేంద్ర పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పలు సందర్భాల్లో బహిరంగంగానూ మంత్రి పదవి దక్కలేదని తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యే మంత్రి పదవి కోసం తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఈసారి కేబినెట్ విస్తరణలో ఎవరికి అదృష్టం వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. కేబినెట్ విస్తరణకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతో పాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రెండు బెర్త్ లలో ఎస్టీ, రెడ్డి సామాజిక వర్గాల వారికి చాన్స్ దక్కే అవకాశం ఉంది. ఎస్టీ సామాజిక వర్గం నుంచి రేసులో రామచంద్రు నాయక్, బాలు నాయక్ లు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఒకరికి మంత్రి పదవి దక్కేఅ వకాశాలు ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు.. రెడ్డి సామాజిక వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, సుందర్శన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదు. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ కొనసాగుతున్నారు. అయితే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి కేటాయించాలని స్థానిక నేతలు కోరుతున్నారు. అధిష్టానం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాధాన్యం ఇస్తే.. ఆ జిల్లాకు చెందిన మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిలలో ఎవరికో ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. మరోవైపు.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రేసులో సుందర్శన్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. మరో పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ పూర్తవుతుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటుండగా.. వీరిలో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది. ఈసారి మంత్రి వర్గ విస్తరణలో భాగంగా ప్రస్తుత కేబినెట్‌లో కొనసాగుతున్న వారిలో ఒకరికి ఉద్వాసన పలికే అవకాశాల ఉన్నట్లుగా ఇటీవల కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే, ఇప్పుడు అలాంటిదేమీ లేదని తెలుస్తోంది. ఒకవేళ ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న ఒకరికి ఉద్వాసన పలికితే అదే సామాజిక వర్గం నుంచి మరొకరికి చాన్స్ దక్కే అవకాశాలు ఉన్నాయి.ల

# టీపీసీసీలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు..
## సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం

**హైదరాబాద్, ఆగస్టు 10, పెన్ పవర్:**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) నిర్మాణంలో ముఖ్యమైన మార్పులు రాబోతున్నట్లు కనిపిస్తోంది. పార్టీ అధికార వర్గం ఒకే వ్యక్తి చేతుల్లో అధికారం కేంద్రీకరించకుండా, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో కుల, వర్గ సమతుల్యతను కాపాడుకోవాలని వ్యూహాత్మకంగా టీపీసీసీ అడుగులు వేస్తోంది. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలోనే ఈ విషయం ప్రధానంగా చర్చకు వచ్చింది. ఏఐసీసీ స్థాయి నుంచి టీపీసీసీలో నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించాలనే ప్రతిపాదనకు అంతా ఓకే చెప్పారు. ఇది స్థానిక నాయకత్వం, కేంద్ర నాయకత్వం మధ్య సమన్వయంతో జరుగుతున్న ప్రక్రియను సూచిస్తుంది. కేవలం ఒక చీఫ్‌పైనే భారం పడకుండా, బహుళ నాయకత్వ నమూనాను అమలు చేయాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ బీసీ నేపథ్యం నుంచి వచ్చినవారు కావడం ఈ నిర్ణయానికి మూలకారణం. ఒక వర్గం మాత్రమే ఆధిపత్యం చెలాయించకుండా, ఇతర సామాజిక వర్గాల నుంచి ప్రతినిధులను తీసుకురావాలనే స్పష్టమైన ఆలోచన ఉంది. దీని ద్వారా పార్టీ లోపలి అసంతృప్తిని తగ్గించి, విస్తృత సామాజిక ఆధారాన్ని బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అనిపిస్తోంది. సామాజికవర్గాల వారీగా సముత్యం పాటిస్తు నలుగురిని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఇక ఆమోదముద్రే తరువాయి అని తెలుస్తోంది. ఎంపిక చేసిన నలుగురు పేర్లను పీసీసీ జాతీయ నాయకత్వానికి పంపినట్లు సమాచారం. ఎంపిక చేసినవారిలో ఎస్సీ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ వర్గం నుంచి బలరాం నాయక్, మైనారిటీ వర్గం నుంచి అజ్మతుల్లా లేదా ఒబైదుల్లా, ఓసీ వర్గం నుంచి రోహిన్ రెడ్డి లేదా పద్మావతి రెడ్డికి అవకాశం దక్కనుంది. వర్కింగ్ ప్రెసిడెంట్లతోపాటు ప్రచార కమిటీ ఛైర్మన్ పదవి కూడా చర్చనీయాంశమైంది. ఈ పదవికి జగ్గారెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. ప్రచార వ్యూహాలు, సందేశాల రూపకల్పనలో అనుభవం ఉన్న నాయకులను ముందుంచడం పార్టీ ప్రచార యంత్రాంగాన్ని బలోపేతం చేసే ప్రయత్నంగా చూడవచ్చు. నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం టీపీసీసీని మరింత వికేంద్రీకృతంగా మార్చగలదు. ఒకే వ్యక్తి నిర్ణయాలపై ఆధారపడకుండా, వివిధ వర్గాలు, ప్రాంతాలు, సమస్యలపై సమాంతరంగా పని చేసే అవకాశం ఏర్పడుతుంది.

# భూపాలపల్లిలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన

**హైదరాబాద్, ఆగస్టు 10, పెన్ పవర్:**
ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా భూపాలపల్లి జిల్లాకు వచ్చిన డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులతో నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, గంజాయి అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల భద్రత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతన జిమ్ సెంటర్ను ప్రారంభించి, సిబ్బంది ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బందికి హెల్మెట్లను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీసులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని డీజీపీ తెలిపారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మళ్లీ జలజగడం...

**హైదరాబాద్, ఆగస్టు 10 పెన్ పవర్:**
తెలంగాణలో ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే సెంటిమెంట్ రగులుతోంది. ప్రధానంగా "నీటి సెంటిమెంట్" తో ప్రతిపక్ష బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తుంది. తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఏపీకి తరలిస్తున్నారని, గోదావరి, కృష్ణా నదీ జలాలపై రగడ మొదలయింది. తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్ కు తాకట్టు పెడుతున్నారంటూ గులాబీ పార్టీ కాంగ్రెస్ పై మండి పడుతుంది. తన గురువు చంద్రబాబు కోసం గోదావరి, కృష్ణా నీటిని తెలంగాణకు దక్కకుండా ఏపీకి తరలించుకు పోతున్నా మౌనంగా ఉంటున్నారని ఆరోపణలను గుప్పిస్తుంది. దీనికి కాంగ్రెస్ పార్టీ ఘాటుగా కౌంటర్ ఇస్తుంది. తెలంగాణ చరిత్ర తెలంగాణ రాజకీయాల్లో 'నీళ్లు' అనేది కేవలం వనరు మాత్రమే కాదు, ఉద్యమ పునాది నుంచి బలమైన భావోద్వేగ సెంటిమెంట్. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో "నీళ్లు, నిధులు, నియామకాలు" నినాదంలో నీళ్లే ప్రథమ స్థానంలో నిలిచాయి. సమైక్య రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ రాజకీయ పార్టీలు ఎప్పుడూ ప్రజలను ఏకం చేస్తుంటాయి. తెలంగాణ ఉద్యమం వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాలు.

సెంటిమెంట్ మానంగా దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలు పాలకుల నిర్లక్ష్యంతో సీమాంధ్రకు తరలిపోయాయనే ఆవేదన తెలంగాణ సమాజంలో ఉండేది. తాగు, సాగునీరు అందక ఎండిన భూములు, వలసల నేపథ్యమే తెలంగాణ రాజకీయ అస్తిత్వానికి ప్రధాన ప్రాతిపదికగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా నీటి హక్కుల రక్షణే ప్రధాన అజెండాగా సాగుతోంది. గోదావరి, కృష్ణా నదీ జలాల కేటాయింపులు, బోర్డుల సమావేశాల అజెండాలు రాష్ట్రంలో తరచూ తీవ్ర రాజకీయ రగడకు దారితీస్తున్నాయి. పక్క రాష్ట్రాల ప్రాజెక్టుల విస్తరణ లేదా కొత్త ప్రతిపాదనలు పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం

తమదే నీటి హక్కుల పరిరక్షణ అంటుంటే, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల ప్రారంభాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక శక్తిగా ఉంటాయి. నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందనే చిన్న సంకేతం కూడా తెలంగాణలో వెంటనే బలమైన రాజకీయ వ్యతిరేకతను, సెంటిమెంట్‌ను రగిలిస్తుంది. మరి ఈ సెంటిమెంట్ ఎప్పటి వరకూ కొనసాగిస్తారో.. ఎవరు అధిగమించి అధికారాన్ని చేపడతారో చూడాల్సి ఉంది.

# రెంట్ బాయ్‌ఫ్రెండ్ తో జరాభద్రం

**హైదరాబాద్, ఆగస్టు 10, పెన్ పవర్:**
సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్.. సోషల్ మీడియాలో జరుగుతున్న మరో మోసంపై యువతను అప్రమత్తం చేశారు. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో నెట్టింట జరుగుతున్న ప్రచారం వెనుక ఉన్న మోసాలను వివరిస్తూ అమ్మాయిలు, యువతులను అలర్ట్ చేశారు. ఆకర్షణీయమైన కుర్రాళ్ల ఫోటోలు పెట్టి, అమ్మాయిలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఇలాంటి కేటుగాళ్ల వలలో పడొద్దంటూ హెచ్చరించారు. ఇలాంటి మోసాలను గమనిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియాలో జరిగే మోసాల నుంచి సైబర్ నేరాల వరకూ ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్. ముఖ్యంగా యువతీ, యువకులు మోసాలకు గురికాకుండా సోషల్ మీడియా ద్వారావారిని అలర్ట్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే రెంట్ బాయ్‌ఫ్రెండ్ పేరుతో నెట్టింట జరుగుతున్న మోసాలపై మరోసారి యువతను అప్రమత్తం చేశారాయన. ఆగస్ట్ నెలలో రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు వల వేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. అలర్ట్‌గా ఉండాలని అమ్మాయిలకు సూచించారు. ఒంటరితనంతో బాధపడుతున్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అది కూడా 50 శాతం ఆఫర్లతో అంటూ సోషల్ మీడియాలో కలర్‌ఫుల్‌గా కనిపించే పోస్టర్ల వెనుక సైబర్ మోసం దాగి ఉందని.. అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు విసురుతున్న కొత్త డేటింగ్ ట్రాప్ ఇదంటూ సజ్జనార్ హెచ్చరించారు. ఫేస్ బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లోఆకర్షణీయంగా ఉండే అబ్బాయిల ఫోటోలను చూపిస్తూ.. కాఫీ మీటింగ్, సినిమా డేట్, షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లు, ఫుల్ డే ప్యాకేజీ అంటూ కేటుగాళ్లు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. గోప్యత, భద్రత పాటిస్తామని, అక్రమ వ్యాపారం కాదని నమ్మబలుకుతూ బుకింగ్స్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతూ నెట్టింట ప్రచారం చేస్తున్నారని సజ్జనార్ వివరించారు."ఏఐతో సృష్టించిన, ఇంటర్నెట్ నుంచి సేకరించిన అందమైన కుర్రాళ్ల ఫోటోలను ప్రొఫైల్ పిక్చర్లుగా పెట్టి, మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో సంభాషణలు మొదలుపెడతారు. బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ అమౌంట్ పేరుతో డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసి, ఆపై అకౌంట్లను బ్లాక్ చేస్తారు. ఆన్‌లైన్ సంభాషణలు నమ్మి అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడానికి వెళ్తే వారు మిమ్మల్ని సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉంది. ప్రేమ పేరుతో అబద్ధాలు చెప్పి మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చాటింగ్ క్రమంలో చాకచక్యంగా సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత ఫోటోల ఆధారంగా ఆ తర్వాత బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది." అని సజ్జనార్ యువతులు, అమ్మాయిలను అప్రమత్తం చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ రకమైన మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం దృష్టిసారించిందని.. వీటికి బాధ్యులైన వారిపై వేగంగా దర్యాప్తు చేసి.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో అమ్మాయిలతో పాటుగా, వారి తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. తమ పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? బయట ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో ఇలాంటి కేటుగాళ్లు ఇచ్చే డిస్కౌంట్ ఆఫర్లను చూసి మోసపోవద్దని.. అపరిచిత వ్యక్తులతో చాటింగ్, కలవడం కానీ చేయవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి సైబర్ కేటుగాళ్ల బారినపడినా, లేదా అనుమానాస్పద పోస్టులు గమనిస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కి కాల్ చేయాలని.. లేదంటే ఎఎవతీఏతీఅఎవ.ప్రశీజ.ఆఅ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు.

# బీసీల సెంట్రిక్ గా కవిత

**హైదరాబాద్, ఆగస్టు 10, పెన్ పవర్:**
తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్న మాజీ ఎంపీ, మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత.. ఇప్పుడు వ్యూహం మార్చుకున్నట్టు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు తెలంగాణ సెంటిమెంటు, ఉద్యమ కారులు.. వారి హక్కులు, ఉద్యోగాలు అంటూ.. రాజకీయ నినాదాలు చేసిన కవిత.. వీటి వల్ల వర్కవుట్ కాదని అర్థం చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె.. తన పంథాను సమూలంగా మార్చుకున్నట్టు కనిపిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో బీసీ సామాజిక వర్గం అధికారిక లెక్కల ప్రకారం.. 43 శాతం మంది ఉన్నారు. అనధికారికంగా 50 శాతం వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీలను తనవైపు తిప్పుకునే దిశగా కవిత రాజకీయాలకు పదును పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీ ఓటు బ్యాంకు నికరంగా ఎవరికీ ఎడాప్ట్ కాలేదు. బీఆర్ఎస్ అయినా.. బీసీ గణనను తొలిసారి నిర్వహించామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకైనా బీసీలు పూర్తిగా అంకితం కాలేదు. ఈ నేపథ్యంలో వారిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు కవిత ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీసీల హక్కుల సాధన, ఏపీలో చేస్తున్న బీసీల రక్షణ హక్కు చట్టం తరహాలో తెలంగాణలోనూ బీసీలకు రక్షణ హక్కు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు.. రాజకీయంగా అదేవిధంగా రాజ్యాంగ పరంగా కూడా.. బీసీలకు 50 శాతం పదవులు కేటాయించాలని కోరుతున్నారు. వాస్తవానికి కవిత బీసీ కాకపోయినా.. ఆ వర్గాన్ని తనదైన శైలిలో తనవైపు తిప్పుకొనేందుకు బీసీల



సమస్యలను భుజాని వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం నినాదాలకే పరిమితం కారాదని కూడా కవిత నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. బీసీల కోసం ఉద్యమం చేయాలనే దిశగా కవిత ఆలోచన చేస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంటు నుంచే ఆమె పని ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించిన తరహాలో బీసీల కోసం.. వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించి.. ఢిల్లీ నుంచే తన వ్యూహాన్ని పెంచాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కార్యాచరణపై ప్రస్తుతం కవిత కసరత్తు చేస్తున్నారు. ఇది అయిన తర్వాత.. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కోసం ఉద్యమం నిర్మించి.. జిల్లాల వారీగా పర్యటనలు చేయాలనినిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇది ఏమేరకు వర్కువుట్ అవుతుందో చూడాలి.

# పిఠాపురంలో రోడ్లకు మహర్దశ

**కాకినాడ, ఆగస్టు 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా పల్లెల నుంచి పట్టణాల వరకు మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా రహదారుల పునర్నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసమే ఏకంగా రూ. 200 కోట్లకు పైగా నిధులను వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంతో మొత్తం 307 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణ ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో 152 కిలోమీటర్ల మేర 611 రోడ్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. నిర్ణీత లక్ష్యంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి కావడంతో పిఠాపురం నియోజకవర్గంలో రవాణా వ్యవస్థ రూపురేఖలు మారిపోయి గ్రామాల్లో కొత్త కళ సంతరించుకుంది. రహదారుల నిర్మాణంలో ప్రజల, రైతులు, మత్స్యకారుల అవసరాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. దశాబ్దాలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా జెట్టీకి వెళ్లే మార్గంలో గ్రావెల్ రోడ్డును నిర్మించి వారి రవాణా కష్టాలను తీర్చారు. అంతేకాకుండా సముద్ర కోత వల్ల ఇళ్లను కోల్పోయిన మాయాపట్నం మత్స్యకారులకు సుబ్బంపేట సమీపంలో కల్పించిన కొత్త మాయాపట్నం పునరావాస కాలనీలో 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రూ. 1.52 కోట్లతో 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కొత్తసూరాడపేట పునరావాస కాలనీకి సైతం రూ. 93 లక్షలతో 1.6 కిలోమీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించి, ప్రధాన రహదారికి అనుసంధానం చేశారు. తుపాన్ల ధాటికి పూర్తిగా కొట్టుకుపోయిన యు.కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి–రామన్నపాలెం బీచ్ రోడ్డును రూ. 88 లక్షలతో పునర్నిర్మించడం ద్వారా వేలాది మంది ప్రజలకు, స్థానిక బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గం



సుగమమైంది. సెజ్ పరిధిలో ఉండి ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరమైన ముమ్మిడివారిపాడు గ్రామానికి రూ. 79.70 లక్షలతో శాశ్వత రహదారిని అందుబాటులోకి తెచ్చారు. కొత్తపల్లి గ్రామంలో ప్రజల చిరకాల కోరికైన శ్మశాన వాటిక దారిని రూ. 26.30 లక్షలతో సీసీ రోడ్డుగా మలిచారు. కొండెవరం గ్రామ పరిధిలోని పిఠాపురం–ఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డును రూ. 1.22 కోట్ల ఉపాధి నిధులతో పవన్ కళ్యాణ్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. మరోవైపు దశాబ్దాలుగా గుంతలమయమై నరకప్రాయంగా మారిన గొల్లప్రోలు మండలం వెన్నెపూడి జీఎస్టీ ప్రధాన రహదారిని రూ. 85 లక్షలతో, గొల్లప్రోలు–తాటిపర్తి పుంత రోడ్డును రూ. 1.46 కోట్లతో పునర్నిర్మించి రైతులకు, ప్రయాణికులకు ఊరటనిచ్చారు. చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీ వాసుల కోసం రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భద్రతకై రూ. 50 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు. వ్యవసాయ రంగ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 'పల్లెపండుగ 2.0' ద్వారా పంట పొలాల మధ్య ఉన్న డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పి.రాయవరం, బి. ప్రత్తిపాడు గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి 3 కిలోమీటర్ల మేర నిర్మించిన గ్రావెల్ రోడ్లు దాదాపు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు మెరుగైన రవాణా సదుపాయాన్ని కల్పించాయి. అభివృద్ధి పనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న 70 కిలోమీటర్ల పెండింగ్ రోడ్డు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు

# జనాలు ఓట్లు రాలుస్తాయా.....

**విజయవాడ, ఆగస్టు 10, పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పర్యటనలు ఎప్పుడూ రాజకీయంగా చర్చనీయాంశంగానే మారుతుంటాయి. ఆయన ఎక్కడికి వెళ్లినా పెద్ద ఎత్తున ప్రజలు కనిపించడం సహజమే. గతంలో పార్టీ నాయకులు ప్రత్యేకంగా జనసమీకరణ చేపట్టేవారనే విమర్శలు వినిపించేవి. అయితే ఇప్పుడు పరిస్థితి మారిందని వైసీపీ నాయకులు చెబుతున్నారు. జగన్ పర్యటనలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, ఎవరినీ ప్రత్యేకంగా తీసుకురావాల్సిన అవసరం లేదని వారు వాదిస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళం తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగిన పర్యటనల్లో కనిపించిన జనసందోహాన్ని ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు. అయితే ఈ పరిస్థితిని మరో కోణంలో కూడా రాజకీయ విశ్లేషకులు పరిశీలిస్తున్నారు. పెద్ద ఎత్తున జనాలు రావడం రాజకీయంగా బలం చూపించినా, భద్రతా పరంగా మాత్రం సవాళ్లు పెంచుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. భారీగా ప్రజలు చేరడం వల్ల తొక్కిసలాటలు, ఆస్తి నష్టం లేదా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాంటి సంఘటనలు భవిష్యత్తులో రాజకీయంగానే కాకుండా చట్టపరంగానూ ఇబ్బందులు తీసుకురావచ్చని అంచనా వేస్తున్నారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పర్యటన సందర్భంగా ఒక మహిళకు చెందిన దుకాణం దెబ్బతినడం, పొగాకు బేళ్లపై కొందరు ఎక్కి తొక్కడం వంటి ఘటనలు చర్చకు వచ్చాయి. అలాగే శ్రీకాకుళం జిల్లాలో మహిళా ఎస్పై విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన తోపులాట కూడా వివాదాస్పదమైంది. ఈ సంఘటనలకు సంబంధించిన వీడియోలు, వివరాలను అధికార వర్గాలు ప్రత్యర్థి పార్టీ నాయకులు నమోదు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. గతంలో గుంటూరు జిల్లాలో జరిగిన మరో ఘటన కూడా తరచూ ప్రస్తావనకు వస్తోంది. ఒక పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళ్లిన సమయంలో జరిగిన రద్దీలో మరో కార్యకర్త వాహనం కింద పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు రాజకీయ కార్యక్రమాల్లో భద్రత ఎంత ముఖ్యమో గుర్తు చేస్తున్నాయి. ఇదే తరహా ఘటనలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా చోటుచేసుకున్నాయి. తమిళనాడులో విజయ్ నిర్వహించిన భారీ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. అలాగే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలో కూడా భారీ జనసందోహం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. బీహార్ లో ప్రశాంత్ కిశోర్ పాదయాత్ర సందర్భంగా భద్రతా సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ సభలు, ర్యాలీలు, పాదయాత్రల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలపై ప్రభుత్వం, పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశముంది. భవిష్యత్తులో జగన్ చేపట్టే పాదయాత్ర లేదా ఇతర భారీ కార్యక్రమాలకు అనుమతులు, భద్రతా నిబంధనల విషయంలో మరింత కఠినమైన షరతులు విధించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ బలం చూపించడమే కాకుండా ప్రజల భద్రతను కాపాడటం కూడా అన్ని పార్టీల ప్రధాన బాధ్యత అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**జైలు కెళ్తే టిక్కెట్ గ్యారంటీ**

వైసీపీలో ఇపుడు కొత్త చర్చ సాగుతోంది. పార్టీ కోసం జనంలో ఉండి పోరాడామని ఎవరు చెప్పినా దానికి అధికారిక పత్రం ఏమి ఉంటుంది అన్నదే అంతా అనుకుంటారు. అదే ఏదో విధంగా జనంలోకి వచ్చి పోరాటాలు చేస్తే ఆ మీదట ఎటూ పోలీసులు కేసు కడతారు, అలా అరెస్టు అయి జైలు పాలు అయితే అది నేరుగా అధినాయకత్వం దృష్టిలోకి వెళ్తుందని తప్పకుండా అలాంటి వారికే టికెట్ దక్కుతుందని అంటున్నారు. వైసీపీలో ఈ అరెస్టులు జైళ్ళు ఇలా ఎంతో మంది నాయకులు గత రెండేళ్ళుగా ఎదుర్కొంటూ వచ్చారు, ఇపుడు మరింత మంది జైలులో ఉన్నారు, ఇంకొంతమంది జైలుకు వెళ్ళే బాటలో ఉన్నారని అంటున్నారు. వైసీపీ నేతలు ఎవరైనా అరెస్టు అయితే ఆ పార్టీ అధినాయకత్వం నుంచి భారీ రియాక్షన్ వస్తోంది. నేరుగా జగన్ ట్వీట్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మీద విమర్శలు కూడా అందులో చేస్తున్నారు. అంతే కాదు వారికి పరామర్శలు ఆ మీదట భారీ ప్రచారం వంటివి వెంటవెంటనే జరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో చూసుకుంటే శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు అరెస్టు అయితే జగన్ పరామర్శకు జైలు దాకా వెళ్ళి వచ్చారు. ఆ తరువాత కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే విరూపాక్షని అరెస్టు చేశారు. ఇపుడు శ్రీకాకుళంలో ఆముదాలవలస ఇంచార్జి చింతాడ రవి కుమార్ ని అరెస్టు చేశారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఆయనకు సంఘీభావం ప్రకటించారు. అధినాయకత్వం కూడా దీని మీద ఘాటుగా స్పందించింది. ఆముదాలవలస అంటే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందరికీ గుర్తుకు వస్తారు. అలాంటి చోట 2024 ఎన్నికల తరువాత వైసీపీ అధినాయకత్వం చేసిన మార్పులలో భాగంగా యువ నేత అయిన చింతాడ రవికుమార్ కి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన నాటి నుంచి పార్టీని యాక్టివ్ గా చేస్తున్నారు. జగన్ తాజా శ్రీకాకుళం పర్యటనలో ఆయన భారీ జనాలతో తరలి వచ్చారు. ఈ సందర్భంగానే మహిళా ఎస్సైతో జరిగిన గొడవలో ఆయనను అరెస్టు చేశారు. ఇక ఇపుడు ఆయనకు ఆముదలవలస టికెట్ ఖరారు అయినట్లే అని అంటున్నారు. మరో వైపు భూ కబ్జా ఆరోపణల మీద మాజీ స్పీకర్ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. దాంతో కూడా చింతాడ రవి కుమార్ కి కలిసి వచ్చింది అని అంటున్నారు.

# రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు

**విశాఖపట్టణం, ఆగస్టు 10, పెన్ పవర్:** కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. ప్రస్తుత జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ నెలాఖరు నాటికి ప్రస్తుత జిల్లాపరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో పదవీకాలం పూర్తి అయిన తర్వాత కొత్త జిల్లాపరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త జిల్లా పరిషత్‌ల ఏర్పాటుపై రాష్టంలోని అన్ని జిల్లా పరిషత్ సీఈవోలతో ప్రభుత్వం సమావేశం కానుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే, రాబోయే నెలల్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత, 2022 ఏప్రిల్‌లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే, పరిపాలనాపరమైన ఇబ్బందులను నివారించడానికి, అప్పటికే ఎన్నికైన జిల్లా పరిషత్ మండళ్లు.. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన తమ కార్యకలాపాలను కొనసాగించాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరవుతున్నారు. మరోవైపు కొత్త జిల్లాల కోసం ప్రత్యేక జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసి, వాటికి ప్రత్యేక కార్యాలయ భవనాలను సమకూర్చాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచిస్తోంది. విశాఖపట్నం జిల్లా పరిషత్ మూడు జిల్లా పరిషత్‌లుగా.. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజుగా విభజించనున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయం మాత్రం ప్రస్తుతం ఉన్న భవనం నుంచే తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది. విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో సుమారు 60 శాతం మందిని 24 మండలాలు కలిగిన అనకాపల్లి జిల్లాకు, 30 శాతం మందిని 11 మండలాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన 10 శాతం మందిని కేవలం నాలుగు మండలాలు మాత్రమే ఉన్న విశాఖపట్నం జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల యంత్రాంగాలు ఇప్పటికే కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాల కోసం తగిన భవనాలను, స్థలాలను గుర్తించాయి.

**లోకల్ బాడీ ఎన్నికల తర్వాత కేబినెట్**

మంత్రులు మౌనంగా ఉంటే సహించేది లేదని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. ముఖ్యంగా టీడీపీ మంత్రులకు ఆయన ఈ విషయంలో ఇప్పటికే చాలా సార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చాలా మంది మంత్రులు మౌనంగా ఉండడం.. కనీసం పన్నెత్తు విమర్శ కూడా చేయకపోవడంతో సీఎం మరోసారి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయమే టెలీ కాన్ఫరెన్సు నిర్వహించిన సీఎం చంద్రబాబు.. మంత్రులకు వారి బాధ్యతలను గుర్తు చేసినట్టు తెలిసింది. ఫైళ్ల క్లియరెన్సు, శాఖలపై పట్టు విషయంలో రెండున్నరేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఐదుగురు టీడీపీ మంత్రులు పట్టు పెంచుకోలేక పోయారని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఇక, ప్రత్యర్థులు చేస్తున్న దాడిని ఎదుర్కొనడంలో దాదాపు సగం మంది మౌనంగానే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంకా.. ప్రతి విషయాన్నీ తాను చెప్పాలంటే కుదరదని.. ఇక నుంచి అయినా.. మిషన్ మోడ్‌తో పనిచేయాలని సూచించారు. ప్రత్యర్థులు రెచ్చిపోతున్నా.. మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఇక, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రులకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఒక్క చోట కూడా.. కూటమి పార్టీలు ఓటమి చవి చూడకూడదని స్పష్టం చేశారు. ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అదే సమయంలో మీడియా ముందుకు రావడం.. ప్రజలకు మంచిని వివరించడం చేయాలని చెప్పారు.

## రైతుల పంట విరామం

**ఏలూరు, ఆగస్టు 10 పెన్ పవర్:** ఆరుగాలం శ్రమించిన పంట చేతికి అందుతుందన్న దశలో ప్రకృతి వైపరీత్యాల బారినపడి ఖరీఫ్ పంట నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికంతటికి మురుగు కాలువల ఆక్రమణ, విచ్చలవిడిగా ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లోనూ వదులుతుండటం కారణమని రైతులు వాపోతున్నారు. జూలై నెలాఖరు వరకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇలా అనేక కారణాలు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నాయని, ఈ క్రమంలోనే సాగు చేయలేమంటూ రైతులు విరమణ ప్రకటించారు అల్లవరం మండలం తాడికోన గ్రామంలో వరి రైతులు. ఊడ్పుని చేలు వద్ద పంట విరామం ప్రకటిస్తున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో చర్చకు దారితీసింది. ఈ క్రమంలోనే తాడికోన గ్రామంలో ఎవ్వరు ఊడ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. డ్రెయిన్ల ఆక్రమణపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం స్పందించడం లేదని అన్నారు. దీంతో చిన్నపాటి వర్షాలకి పంట పొలాలు ముంపు గురై పంట నాశనం అవుతుందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడులు దక్కక అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క విచ్చలవిడిగా ఆక్వా చెరువులు తవ్వి అక్రమ సాగు చేస్తున్న తీరుపై ఫిర్యాదులు చేస్తున్న కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ రైతులు మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో పంట విరామం ప్రకటిస్తున్నట్లు తాడికోన రైతులు వెల్లడించారు. అల్లవరం మండలం బెండమూర్లంకలో చారిత్రాత్మకమైన మొదటి పంట విరామ ఉద్యమం 2011లో రైతులు ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడం, పెట్టుబడి వ్యయం పెరిగిపోవడం, డ్రెయినేజీ సమస్యల వల్ల బెండమూర్లంక రైతులు తొలిసారిగా ఈ వినూత్న ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమ ప్రభావం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మోహన్ కందా కమిటీ వేసి క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులపై విచారణ చేపట్టించారు. ఇదే తరహాలో కాలువల ఆధునికీకరణ, ధాన్యం బకాయిల ఆలస్యంపై నిరసనగా మళ్లీ 2022 ఖరీఫ్ సీజన్‌లో బెండమూర్లంకతోపాటు అల్లవరం మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు పంట విరామం ప్రకటించారు. మళ్ళీ ఇప్పుడు ఇదే మండలంలోని తాడికోన గ్రామం నుంచి పంట విరామం ఉద్యమం ప్రారంభించారు.

## 100 శాతం టెలికాం కనెక్టివిటీ

**విజయవాడ, ఆగస్టు 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కమ్యూనికేషన్ రంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ప్రతీ మారుమూల గ్రామానికి, గిరిజన ప్రాంతాలకు సైతం నెట్‌వర్క్ సౌకర్యాన్ని చేర్చడం ద్వారా 100 శాతం టెలికాం కనెక్టివిటీని సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా టెలికాం ఆపరేటర్లను మరియు టవర్ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఎన్నడూ లేని విధంగా భారీ రాయితీలను, సరికొత్త రాయితీ విధానాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చింది. ఈ మెగా ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు మొబైల్ టవర్ల ఏర్పాటుకు ఎలాంటి అద్దె లేకుండా ఉచితంగా ప్రభుత్వ భూములను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనితో పాటు సదరు టెలికాం టవర్లకు అత్యంత తక్కువ ధరకే రాయితీపై విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించింది. టెలికాం ఆపరేటర్ల నుండి వచ్చే ప్రతిపాదనలను ఎప్పటికప్పుడు వేగంగా పరిశీలించి, ఎక్కడా జాప్యం లేకుండా టవర్ల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో టవర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూములను తక్షణమే గుర్తించి కేటాయించాల్సిందిగా వివిధ శాఖల ప్రభుత్వ కార్యదర్శులను ఐటీ శాఖ కోరింది. అలాగే క్షేత్రస్థాయిలో ఈ భూముల కేటాయింపు ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేకంగా సహకరించాలని రాష్ట్ర ఐటీ రక్షణ శాఖ స్పష్టం చేసింది. డిజిటల్ ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల రాష్ట్రంలో ఇంటర్నెట్, మొబైల్ సిగ్నల్స్ లేని ప్రాంతమంటూ లేకుండా పోతుందని, దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరియు డిజిటల్ సేవలు మరింత విస్తరిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

## ఉలవపాడులో పునాస మామిడికి డిమాండ్

**ఒంగోలు, ఆగస్టు 10, పెన్ పవర్:** ఏపీలో ఉలవపాడు మామిడి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో దొరికే పునాస రకం మామిడితో భారీ లాభాలు అందుకుంటున్నారు. ఈసారి కేజీ కాయలు రూ.50 వరకు పలుకుతున్నాయి.. దీంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ నెలలో ఓనం పండగ కూడా ఉండటంతో మామిడి కాయలకు ఇంకా మంచి ధర వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది కాస్త లాభాలు వస్తాయని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా ఉలవపాడు మామిడి కాయలు బాగా ఫేమస్. బంగినపల్లి, రసాలు సహా పలు రకాల మామిడి కాయలు సీజన్‌లో దొరుకుతాయి. మార్చి నెలలో సీజన్ మొదలైతే.. జూన్ వరకు కొనసాగుతుంది. ప్రతి ఏటా సీజన్ ముగిశాక కూడా మామిడి రైతులు పునాస రకం కాయల ద్వారా ఆదాయం పొందుతున్నారు. కొన్నేళ్లుగా పునాస కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మాత్రం అలా కాదు.. పునాస కాయల ధరలు దుమ్ము రేపుతున్నాయి.. భారీగా లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ప్రకాశం జిల్లా గుడ్లూరు, ఉలవపాడు మండలాలు సహా అన్ని చోట్లా కలిపి పునాస మామిడిని ఐదువేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, రసాలు, బెంగళూరు రకం కాయల సీజన్ తర్వాత.. జులై, ఆగస్టు నెలల్లో పునాస పంట చేతికి వస్తుంది. నాలుగైదు రోజులుగా ఈ పునాస రకం మామిడి కాయలకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. కేజీ రూ.50 వరకు పలుకుతోంది.. టన్ను రూ.50వేల వరకు ఉంది. గుడ్లూరు మండలంలో ప్రతి రోజూ నాలుగు టన్నులు వరకు కాయలు చెన్నై, బెంగళూరు సహా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉలవపాడుకు ఈ కాయల్ని తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా పంపిస్తున్నారు. ఈ పునాస మామిడి కాయలు కేరళంలో నిర్వహించే ఓనం పండగకు వినియోగిస్తుంటారు. అందుకే కేరళం రాష్ట్రానికి ఎగుమతులు ఎక్కువగా పునాస కాయల్ని ఎగుమతి చేస్తుంటారు. ఆగస్టు నెలాఖరులో ఈ పండగ ఉండటంతో.. కాయల ధర మరింత పెరిగే అవకాశం ఉందని, లాభాలు వస్తాయని రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ ఏడాది బంగినపల్లి దిగుబడి బావుంది.. కానీ ధరలు మాత్రం లేవు. సీజన్ ముగిసే సమయంలో టన్ను రూ.60వేలు కూడా పలకలేదు. దీంతో రైతులు పెట్టుబడులు కూడా రాలేదని నిరాశ చెందారు.. ఈసారి పునాస రకం మామిడి కాయలకు మంచి ధర రావడంతో ఆ నష్టాల నుంచి కాస్త బయటపడతామని చెబుతున్నారు.

## జనసేన పవర్ ఫుల్ ప్లాన్

**విజయవాడ, ఆగస్టు 10, పెన్ పవర్:** జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైలెంట్ గా తన పని తాను చేసుకుని పోతున్నారు. ఒక వైపు పార్టీ అధినేతగా జనసేనను సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యక్రమాలు చేస్తున్నారు. మరో వైపు ఉప ముఖ్యమంత్రిగా తన దగ్గర ఉన్న ప్రాధాన్యత కలిగిన శాఖలను పూర్తిగా అవగాహన చేసుకుని వాటి పనితీరులో మెరుగుదల చూపిస్తున్నారు. అటవీ శాఖ ద్వారా గిరిజన ప్రాంతాలలో రోడ్లు వేయించి అడవి తల్లి బాట పేరుతో వారికి దారి చూపిస్తున్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. పనిలో పనిగా పర్యావరణ శాఖ మీద కూడా ఆయన దృష్టి పెట్టారు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అయిన పంచదార్ల వద్ద అక్రమ మైనింగ్ జరుగుతోందని తెలిసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నో మైనింగ్ జోన్ గా ప్రకటించాలని కూడా సూచించారు. ఇక పార్టీ పరంగా చూస్తే పవన్ కళ్యాణ్ బూత్ లెవెల్ నుంచి జనసేనను పటిష్టం చేసే కార్యక్రమం ముమ్మరం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికే పెద్ద పీట వేస్తున్నారు. అంతే కాక వారు జనసేనలో ఏళ్ళ తరబడి పనిచేసేలా ఉండడమే అర్హతగా చూసుకుంటున్నారు. రేపు జరిగే స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎత్తిన వారికే సీట్లు అన్న విధానం కూడా తీసుకుని రావాలని చూస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ విధంగా జనసేనను నమ్ముకుంటే తమకు న్యాయం జరిగింది అన్నది పార్టీ క్యాడర్ అంతా అనుకుని సుదీర్ఘ కాలం పాటు గట్టిగా నిలబడేలా జనసేన అధినాయకత్వం పక్కాగా ప్రణాళికలను రచిస్తోంది అని అంటున్నారు. ఇక దైనందిన విషయాల్లో ప్రత్యర్థుల మీద విమర్శలు ఉంటూ ఉంటాయి. వైసీపీ మీద ప్రతీ రోజూ విమర్శలు చేసే విధానానికి జనసేన దూరంగా ఉంటోంది. అందుకే ఆ పార్టీ తన లక్ష్యాలను ఏమిటో నిర్దేశించుకుని వాటికి అనుగుణంగా ముందుకు సాగుతోంది అని అంటున్నారు. వారిని వీరు వీరిని వారు విమర్శించుకోవడం వల్ల ఉపయోగం లేదని మీడియాలో హైప్ క్రియేట్ కావడం తప్ప గ్రౌండ్ లెవెల్ లో ఏమీ ఉండదని జనసేన భావిస్తోంది. అందుకే జనసేన ఈ తరహా విమర్శల రాజకీయానికి దూరంగా ఉంటోంది అని అంటున్నారు. ఇక జనసేన 2029 ఎన్నికల మీదనే తన చూపు నిలిపింది అని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు పొత్తులో భాగంగా కోరాలీ అంటే ముందు పార్టీగా బలపడాల్సిన అవసరం ఉందని జనసేన నమ్ముతోంది. పార్టీకి బూత్ లెవెల్ నుంచి క్యాడర్ అలాగే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలతో పాటు నియోజకవర్గాన్ని నడిపించే బలమైన నాయకత్వం ఉంటే కచ్చితంగా ఎక్కువ సీట్లు తీసుకోవచ్చు అని భావిస్తోంది. వచ్చే ఎన్నికలు జనసేనకు ఒక విధంగా కీలకం అని అంటున్నారు. ఎక్కువ సీట్లు తీసుకుని 2024 మాదిరిగానే సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ తో గెలిస్తే కచ్చితంగా ఆ తరువాత ఏర్పడే ప్రభుత్వంలో ముఖ్యమైన పాత్ర పోషించేందుకు వీలు ఉంటుందని కూడా ఆలోచిస్తోంది అని అంటున్నారు. మొత్తానికి జనసేన దీర్ఘ కాలం ఆలోచనలు చేస్తోంది. అందుకే సైలెంట్ గానే పవన్ తన పని ఏంటో చేసుకుని పోతున్నారు అని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# పట్టు దొరికిందా... రాహుల్ జోరు...హుషార్



**హైదరాబాద్ పెన్ పవర్:** పప్పు అన్న ట్రోలింగ్ నుంచి నిప్పు మాదిరిగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇపుడు తయారయ్యారు అన్నది ఒక ఘాటు విశ్లేషణ. రాహుల్ గాంధీ 2014 నాటికి అయితే పప్పు అంటూ బీజేపీ నేతలు ట్రోల్స్ చేసేవారు. ఆయనను గాంధీల వారసుడిగా మాత్రమే చూపించేవారు. నాయకత్వ లక్షణాలు ఏ మాత్రం లేవని కూడా విమర్శించేవారు. అయితే 2019 నాటికి కొంత రాటు దేలిన రాహుల్ గాంధీ 2024 కి బాగానే సర్దుకున్నారు. ఇపుడు చూస్తే మోడీ మూడవ టెర్మ్ లో రెండేళ్ళ పాలన ముగిసిన తరువాత విపక్షానికి పట్టు దొరికింది అని అంటున్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఈ చాన్స్ ని అసలు మిస్ చేసుకోకూడదని భావిస్తున్నారు. అందుకే ఆయన మోడీ సర్కార్ మీద దూకుడుగా రాజకీయం చేస్తున్నారు. జెన్ జీతోనే జవాబు చెప్పాలని అనుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రయాగలో రాహుల్ గాంధీ పర్యటన ఆసక్తికరంగా సాగింది. ఆయన బీహార్ యూపీల నుంచి వచ్చిన జెన్ జీ యువతను ఉద్దేశిస్తూ చేసిన స్పీచ్ మోడీ సర్కార్ కి గట్టిగానే తగిలింది అని అంటున్నారు.

**చక్రబంధంలో యువత అంటూ :**

యువ శక్తిని రాహుల్ గాంధీ బలమైన వనరుగా పేర్కొంటున్నారు. అంతే కాదు వారిని సరిగ్గా వినియోగించుకోకుండా చక్రబంధంలోకి మోడీ ప్రభుత్వం ఇరికించింది అని ఆయన నిప్పులు చెరిగారు. ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో జరిగిన ఛాత్రోం కీ గూంజ్ అనే వినూత్న కార్యక్రమంలో రాహుల్ గాంధీ గతంలో ఎన్నడూ లేని విధంగా మోడీ ప్రభుత్వం మీద విమర్శలు సంధించారు. దేశంలోని జెన్ జీ యువతను నిరుద్యోగ అభ్యర్థులను ఉద్దేశించి చేసిన ప్రసంగం కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు ఎక్కు పెట్టేలా చేసింది. దేశంలో అడుగడుగునా పేపర్ లీక్‌లు, తగ్గుతున్న ఉపాధి అవకాశాలు, నిరుద్యోగంపై ఆయన లేవనెత్తిన అంశాలు రాజకీయంగా ఇపుడు అతి పెద్ద హాట్ టాపిక్‌గా మారాయి. ఈ రోజున దేశంలో చదువుకున్నా ఉద్యోగాలు రావడం లేదని ఆ మాటకు వస్తే డిగ్రీ సర్టిఫికెట్లకు విలువ లేకుండా పోయిందని రాహుల్ ఆరోపించారు. ఇక దేశంలోని 40 కోట్ల మంది యువతను ఖరీదైన విద్య, పేపర్ లీక్‌లు, తగ్గిన ఉపాధి అవకాశాలనే చక్రవ్యూహంలో ఇరికించారని రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. రాహుల్ సభకు భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరు కావడమే కాకుండా ఆయనతో తమ సమస్యలను పంచుకోవడం విశేషం.

**మోడీ ఇమేజ్ డ్యామేజ్ :**

ఇక ఇదే ఊపుతో రాహుల్ గాంధీ ఒక జాతీయ పత్రికలో రాసిన వ్యాసంలో మోడీతో పాటు అమిత్ షా మీద తీవ్రంగా విరుచుకుపడ్డారు. మోడీ ఇమేజ్ డ్యామేజ్ అయింది అని ఆయన అన్నారు. దిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు కూడా అయిన రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థుల మీద లాఠీఛార్జ్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ఒక జాతీయ వార్తాపత్రికకు రాసిన వ్యాసంలో ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనతో ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్ఠ నాశనమైందని ఆరోపించారు. దానిని తిరిగి పునర్నిర్మించలేరని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మరే ఇతర అధికారులు గానీ వారి చర్యల పర్యవసానాల నుంచి తప్పించుకోలేరని అన్నారు.

**యువత ఎప్పటికీ వదిలిపెట్టదని :**

ప్రత్యేకించి మోడీ ప్రతిష్ట గురించే ఈ వ్యాసంలో రాహుల్ రాసిన అనేక అంశాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మోడీ రాజకీయ ఇమేజ్ అన్నది పూర్తిగా దెబ్బ తిందని ఇక దానిని తిరిగి నిర్మించడం అన్నది కష్టతరమైన విషయం అని ఆయన అంటున్నారు. అంతే కాదు విద్యార్థుల ఆగ్రహం నుంచి మోడీ అమిత్ షాలు తప్పించుకోలేరని కూడా ఆయన స్పష్టం చేస్తున్నారు. విద్యార్థులను యువతను అణచివేయాలని చూశారంటూ మోడీ సర్కార్ మీద తీవ్ర విమర్శలే చేశారు. ఈ క్రమంలో విద్యార్థులని ఇబ్బంది పెట్టిన వారిని ఈ దేశ యువత ఎప్పటికీ వదిలిపెట్టదని రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పడం ద్వారా బీజేపీకి జెన్ జీ నుంచి ముంచుకొస్తున్న పెను ముప్పుని గుర్తు చేశారు. రానున్న రోజులలో దేశంలో 40 కోట్ల మంది ఉన్న యువత మద్దతు బీజేపీకి ఏ మాత్రం దక్కదన్న ధీమాతో రాహుల్ విమర్శలు ఉన్నాయి. మొత్తానికి బీజేపీ గ్రాఫ్ తగ్గిపోతోందని అది మళ్ళీ పెరిగే సూచనలు లేవని రాహుల్ గ్రహించి తనదైన విశ్లేషణలతో దూకుడు చేస్తున్నారు అని అంటున్నారు.

# పెళ్లి కావాలంటే అమ్మాయి పేరుపై ఆస్తులు రాయాల్సిందే.. పోస్ట్ వైరల్

**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా వివాహ సంబంధాలు కుదుర్చుకునేటప్పుడు వధూవరుల కుటుంబాల మధ్య నడిచే చర్చలు ఒక్కోసారి ఆసక్తికరంగా.. మరికొన్నిసార్లు వివాదాస్పదంగా మారుతుంటాయి. కట్నకానుకలు, ఉద్యోగం, జీతం, ఆర్థిక స్థోమత వంటి అంశాలు వివాహ నిశ్చయాల్లో ఎప్పుడూ కీలక భూమిక పోషిస్తూనే ఉంటాయి. అయితే తాజాగా అరేంజ్డ్ మ్యారేజ్ మార్కెట్‌లో ఓ వధువు కుటుంబం నుంచి వచ్చిన వింత.. భారీ డిమాండ్ సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**రెడిట్ పోస్ట్‌లో ఏముంది?**

ఓ యువకుడు తన పెళ్లి సంబంధానికి సంబంధించిన అనుభవాన్ని ప్రముఖ సోషల్ మీడియా వేదిక 'రెడిట్' లో పంచుకున్నాడు. తనకు పెళ్లి సంబంధం చూసే సమయంలో వధువు కుటుంబ సభ్యులు పెళ్లి జరగాలంటే ఏకంగా రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల విలువైన ఆస్తులను అమ్మాయి పేరుపై రాయాలని షరతు విధించినట్లు సదరు యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పెళ్లికి ముందే ఈ ఆస్తుల బదిలీపై స్పష్టమైన హామీ ఇస్తేనే ముందుకు వెళ్తామని వారు స్పష్టం చేసినట్లు ఆ పోస్టులో పేర్కొన్నాడు. ఈ రెడిట్ పోస్ట్‌లో పేర్కొన్న వివరాలు సదరు వ్యక్తి చెప్పిన వ్యక్తిగత అనుభవం మాత్రమే. దీనికి సంబంధించి ఎలాంటి స్వతంత్ర ధృవీకరణ లేదా అధికారిక ఆధారాలు లేవనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

**నెటిజన్ల మధ్య వేడివేడిగా చర్చ**

ఈ పోస్ట్ నెట్టింట ప్రత్యక్షమవ్వగానే నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందనలు వ్యక్తమవుతున్నాయి. పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులు, రెండు కుటుంబాల మధ్య బంధమని, దాన్ని ఆస్తులు-పాస్తుల లావాదేవీగా మార్చడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు. సమాజంలో సాధారణంగా వరకట్నం డిమాండ్ల గురించి ఎక్కువగా వింటుంటామని.. అయితే ఈ మధ్యకాలంలో వధువు వైపు నుంచి కూడా ఇలాంటి విపరీతమైన షరతులు రావడం గమనార్హమని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఒకరిద్దరు చేసే పనులను బట్టి మొత్తం సమాజానికి లేదా వివాహ వ్యవస్థకే వర్తింపజేయడం సరికాదని మరికొందరు స్పష్టం చేస్తున్నారు.

**సంబంధాలలో స్పష్టత.. గౌరవం ముఖ్యం**

ఆధునిక కాలంలో సమాజం ఎంతగా పురోగమిస్తున్నప్పటికీ.. వివాహ వ్యవస్థలో డబ్బు, ఆస్తుల ప్రస్తావన ఈ స్థాయిలో రావడం ఆందోళన కలిగించే విషయమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. పెళ్లి బంధం నిలబడాలంటే పరస్పర నమ్మకం, గౌరవం, అవగాహన ముఖ్యం కానీ బలవంతపు డిమాండ్లు కావు. ఇరు కుటుంబాలు ఒకరి ఆర్థిక పరిస్థితిని మరొకరు గౌరవిస్తూ.. ఎలాంటి ఆర్థిక ఒత్తిళ్లు లేకుండా నిర్ణయాలు తీసుకున్నప్పుడే ఆ వివాహ బంధం సంతోషకరంగా సాగుతుంది.

# కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లు.. పట్టాదారు పుస్తకాలపై సీఎం కీలక ప్రకటన!

పట్టాదారు పాసుపుస్తకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. పాసుపుస్తకాలను ట్యాంపర్ చేయకుండా పటిష్టమైన భద్రతా ఫీచర్లు అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. సోమవారం ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో నిర్వహించిన 'మీ భూమి- మీ హక్కు' పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సభలో గత ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో విరుచుపడ్డారు. ఇష్టంలేని వ్యక్తుల భూములను నిషేధిత జాబితాలో చేర్చేలా 22ఏ కింద నమోదు చేశారని మండిపడ్డారు. అంతేకాకుండా 'మీ భూమి- మీ హక్కు' ఇతరులు పెత్తనం ఎందుకు? ప్రభుత్వాలు మారినప్పుడు పాస్ పుస్తకాలపై ఇతరుల ఫోటోలు వేసుకోవడం సరికాదు" అంటూ తేల్చిచెప్పారు. డబుల్ ఇంజన్ సర్కారు బుల్లెట్ వేగంతో అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్తోందని సీఎం తెలిపారు. 2019-24 మధ్య కాలంలో గత పాలకులు చేసిన విధ్వంసం కారణంగా భూ రికార్డులన్నీ ధ్వంసమయ్యాయని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను డిజిటల్‌గా 22ఏ జాబితాలో పెట్టేసి వివాదాస్పదం చేశారని విమర్శించారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఇచ్చిన భూమిని సౌతం 22ఏలో పెట్టగా, ప్రస్తుతం దానిని పరిష్కరించి పట్టాలు అందించామని వెల్లడించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి భారీ ఎత్తున భూ ఫిర్యాదులు అందాయని సీఎం గుర్తుచేశారు. ఆ సమయంలోనే వీటన్నింటినీ శాశ్వతంగా పరిష్కరించాలని నిశ్చయించుకున్నామని, అంశాల వారీగా సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలు పట్టించుకోకుండా 151 సీట్లు వచ్చిన వ్యక్తులు ఏమయ్యారో ప్రజలందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. గత పాలకులు బటన్ నొక్కడం, పరదాల చాటున తిరగడం, సభలు పెట్టి చెట్లు నరికేయడం వంటి పనులు మాత్రమే చేశారని విమర్శించారు. కానీ తాము ప్రతీ నెలా ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఇలాంటి సమావేశాల ద్వారా ప్రజలను కలుస్తున్నామని స్పష్టం చేశారు.

**అధునాతన భద్రతా ఫీచర్లతో పాస్ పుస్తకాలు**

కరెన్సీ నోట్లకు ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలు ఎవరూ ట్యాంపర్ చేయకుండా పకడ్బందీ భద్రత కల్పించామన్నారు. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్ సహా




ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు, భూ యజమానులకు అందించామని సీఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి మొత్తం 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు 41 వేల ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితా నుంచి తప్పించి, 1.47 లక్షల మందికి పైగా రైతులకు పట్టాలు ఇచ్చామన్నారు. ప్రత్యేకించి ఏలూరు జిల్లాలోనే 5,500 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు పట్టాలు అందజేసినట్లు చెప్పారు. ప్రతీ రైతుకు, భూ యజమానికి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందే వరకు విశ్రమించేది లేదన్నారు. భూమి తమదైనా వేర్వేరు ఇబ్బందులతో ఇప్పటివరకు రైతులు, భూ యజమానులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1986 నుంచి రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, లింక్ డాక్యుమెంట్లన్నీ ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఇప్పటికే 9 లక్షల మందికి ఆటో మ్యూటేషన్ సౌకర్యం కల్పించామన్నారు. వారసత్వ భూములకు సంబంధించి రూ.10 లక్షల లోపు విలువ ఉన్న వాటిని కేవలం రూ.100 నామమాత్రపు రుసుముతో బదిలీ చేసుకునేందుకు అద్భుతమైన అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే ప్రక్రియ నిర్వహించి, ఈ-కేవైసీ తీసుకున్న తర్వాతే రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ సభలు నిర్వహించి అత్యంత పారదర్శకంగా ఈ పుస్తకాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ ఉద్దేశమని, దీనివల్ల వివాదాలు తగ్గి లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. సూపర్ సిక్స్ లాంటి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సుపరిపాలన అందిస్తూ రాష్ట్ర పునర్నిర్మాణాన్ని వేగవంతం చేశామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఐటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అనుసంధానించి ప్రజలకు అత్యంత సులభంగా పౌరసేవలు అందేలా చర్యలు చేపట్టామన్నారు.

# కూటమిలో ఒంగోలు యుద్ధం.. ఎమ్మెల్యే దామచర్ల ఎం జనసేన నేత బాలినేని!






**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రకాశం జిల్లాలో కూటమి రాజకీయాలు కాకరేపుతున్నాయి. జిల్లా కేంద్రం ఒంగోలులో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం హీట్ పుట్టిస్తోంది. గత కొంతకాలంగా హైదరాబాద్ లో ఉంటున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తన అనుచరులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పై సంచలనానికి తెరలేపారు. ఇక తనపై చేస్తున్న విమర్శలపై తీవ్రస్థాయిలో ఫైర్ అయిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాజీ మంత్రి బాలినేని జనసేనలో ఉంటూ వైసీపీకి పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఇరువురు నేతలు కూటమి ధర్మాన్ని పక్కన పెట్టి మాటలతో పరస్పరం విమర్శలు గుప్పించుకోవడం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తీవ్ర అవినీతికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కూటమి ధర్మం వల్ల తాను ఇంతకాలం మాట్లాడలేదని కానీ ఇప్పుడు తన అనుచరులపై కేసులు నమోదు చేయిస్తూ ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని హెచ్చరించారు. ఒంగోలులో భూకబ్జాలు తారాస్థాయికి చేరాయని ఆరోపించడమే కాకుండా, ఎమ్మెల్యేకు నెలనెలా మామూళ్లు అందుతున్నాయని మాజీ మంత్రి చేసిన ఆరోపణలు కలకలం సృష్టిస్తున్నాయి. ఏడాదిన్నర క్రితం జనసేనకు వచ్చిన మాజీ మంత్రి బాలినేని అధికార పార్టీ ఎమ్మెల్యేను టార్గెట్ చేయడం తీవ్రచర్చనీయాంశం అవుతోంది. ఇక తనపై బాలినేని చేస్తున్న విమర్శలపై ఎమ్మెల్యే దామచర్ల అంతేస్థాయిలో రియాక్ట్ అయ్యారు. జనసేనలో ఉంటూ ఆయన వైసీపీకి పనిచేస్తున్నారని ఎదురుదాడి చేశారు. అంతేకాకుండా బాలినేని, ఆయన కుమారుడుపై వ్యక్తిగత విమర్శలతో విరుచుకుపడ్డారు. బాలినేని అనుచరులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కరపత్రాలు వేశారని, విజయవాడ నుంచి పోస్టు చేయడం సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని, అందుకే పోలీసులు కేసులు నమోదు చేశారని వివరణ ఇచ్చారు. గత ప్రభుత్వంలో బాలినేని చేసిన అవినీతి, అక్రమాలు రాసేందుకు పుస్తకాలు సరిపోవని వ్యాఖ్యానించారు. ఇలా ఇరువురు నేతలు పరస్పరం మాటల దాడి చేసుకుంటూ రోడ్డెక్కడం కూటమి ఐక్యతను దెబ్బతీసేలా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. గత ఎన్నికల్లో బాలినేనిపై సుమారు 35 వేల ఓట్ల తేడాతో ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్ గెలిచారు. ఎన్నికలు ముగిసిన కొద్ది కాలానికే బాలినేని జనసేనలో చేరారు. అప్పట్లోనే బాలినేని జనసేనలో చేరికను దామచర్ల వ్యతిరేకించినా ఇరుపార్టీల అధిష్టాన వర్గాలు జోక్యంతో వెనక్కి తగ్గారు. అయితే అప్పటి నుంచి ఒంగోలు రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్న బాలినేని ఇప్పుడు ఆకస్మికంగా ఎమ్మెల్యేపై ప్రత్యక్ష విమర్శలు చేయడం సంచలనంగా మారింది. ఎమ్మెల్యేపై తీవ్రమైన ఆరోపణలు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం అవినీతిని ప్రోత్సహిస్తున్నట్లు కూటమి నేత బయటపెట్టినట్లైందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక ఈ వివాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోందని అంటున్నారు. కూటమి ఎమ్మెల్యేపై కూటమి పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఆరోపణలు చేయడం ద్వారా ప్రతిపక్షానికి అస్త్రాలు అందించినట్లైందని అంటున్నారు. దీనిపై కూటమి పెద్దలు ఎలా స్పందిస్తారనే అంశం ఉత్కంఠకు గురిచేస్తోందని అంటున్నారు. నిజానికి కూటమిలో సమస్యలు ఏమైనా ఉంటే ఇరుపార్టీలు సంయమనంతో చర్చించుకుని పరిష్కరించుకుంటున్నట్లు చెబుతున్నాయి. కానీ, ఒంగోలులో మాత్రం నేతలు రోడ్డెక్కడం చూస్తే సమన్వయం లోపం స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు. మాజీ మంత్రి బాలినేనికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే జనసేన అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునే అవకాశం ఉందని, కానీ ఆయన ఆ పనిచేయకుండా ఎమ్మెల్యేను బజారుకీడ్చేలా మాట్లాడటమే అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు. మొత్తానికి ఒంగోలులో మొదలైన ఈ తుఫాన్ ఎక్కడి వరకు దారితీస్తుందనేది ఉత్కంఠ రేపుతోందని చెబుతున్నారు.

# దళపతి విజయ్ సాహసోపేత నిర్ణయం.. 'తమిళ తాయ్ వాజ్తు'పై అసెంబ్లీలో తీర్మానం

**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడులో అధికారిక కార్యక్రమాలు, విద్యాసంస్థల్లో రాష్ట్ర గీతానికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ముఖ్యమంత్రి విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. జాతీయ గీతం కంటే ముందే రాష్ట్ర గీతమైన 'తమిళ తాయ్ వాజ్తు'ను తప్పనిసరిగా ఆలపించాలని స్పష్టం చేస్తూ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అసెంబ్లీలో అన్ని పార్టీల నుంచి ఏకగ్రీవ మద్దతు లభించింది. ఈ నిర్ణయం వెనుక బలమైన సాంస్కృతిక, చారిత్రక నేపథ్యం ఉందని చెబుతున్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. అధికారిక వేడుకల్లో తొలుత వందేమాతరం గీతాన్ని, ఆ తర్వాత జాతీయ గీతం జన గణ మన ఆలపించాలని, రాష్ట్ర గీతాలను ఆ తర్వాతే ఉంచాలని సూచించిన నేపథ్యంలో తమిళనాడులో దీనిపై చర్చ చెలరేగింది. కొన్ని విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవ వేడుకల్లో 'తమిళ తాయ్ వాజ్తు'కు మూడవ స్థానం కేటాయించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సాంస్కృతిక, భాషా హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సీఎం విజయ్ ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. 'తమిళ తాయ్ వాజ్తు' గీతానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఈ గీతాన్ని ప్రముఖ కవి



మనోన్మయం సుందరం పిళ్లై 1891లో రచించిన ప్రఖ్యాత నాటకం 'మనోన్మయం' నుంచి స్వీకరించారు. తమిళనాడులో ప్రతి ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభంలోనూ 'తమిళ తాయ్ వాజ్తు'ను మొదటిగా ఆలపించే సంప్రదాయాన్ని 1970లో అప్పటి సీఎం కరుణానిధి ప్రభుత్వం అధికారికంగా తీసుకువచ్చింది. దశాబ్దాల ఈ సంప్రదాయానికి కొనసాగింపుగా, గత డీఎంకే ప్రభుత్వం 2021 డిసెంబర్ 12న దీనికి అధికారికంగా 'రాష్ట్ర గీతం' హోదాను కల్పించింది. అసెంబ్లీలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ సీఎం విజయ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. మన మాతృభాష మన కన్నతల్లి అంత పవిత్రమైనదని, తమిళం కేవలం ఒక భాష మాత్రమే కాదని, అది ప్రతి తమిళుడి ప్రాణం, భావోద్వేగం అని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు గడ్డపై 'తమిళ తాయ్ వాజ్తు'కు ఎప్పుడూ ప్రథమ స్థానమే దక్కాలని, దానికి మొదటి స్థానం ఇవ్వడం రాష్ట్ర హక్కు అని స్పష్టం చేశారు. ఈ అంశంపై రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులందరూ ఈ తీర్మానాన్ని బలపరచగా, సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తాజా నిర్ణయంతో ఇకపై తమిళనాడులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారిక కార్యక్రమాల్లో తొలుత 'తమిళ తాయ్ వాజ్తు', ఆ తర్వాతే జాతీయ గీతాలకు సంబంధించిన నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో అమలవుతాయని స్పష్టమైంది. తమిళ అస్తిత్వం, భాషా గౌరవాన్ని కాపాడే దిశగా సీఎం విజయ్ తీసుకున్న ఈ నిర్ణయం దక్షిణాది రాష్ట్రాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఆగస్టు 7న మక్కాలో పాకిస్తాన్, సౌదీ అరేబియా, తుర్కియే సంతకం చేసిన సంయుక్త రక్షణ ఒప్పందం, పశ్చిమాసియా భద్రతా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులను ప్రతిబింబిస్తోంది. తమలో ఏ ఒక్క దేశంపై సాయుధ దాడి జరిగినా దాన్ని అందరిపైనా జరిగిన దాడిగానే పరిగణిస్తామని మూడు దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్, తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ -ముగ్గురు నేతలూ, తమతమ విదేశాంగ, రక్షణ మంత్రులతో కలిసి ఒప్పందంపై సంతకం చేశారు. ఇది శక్తివంతమైన కూటమే -పాకిస్తాన్ అణ్వాయుధ సంపన్న దేశం. ప్రపంచంలోనే అతిపెద్ద ముడిచమురు ఎగుమతిదారుల్లో ఒకటైన సౌదీ అరేబియాకు భారీ ఆర్థిక వనరులున్నాయి. తుర్కియేకు అధునాతన డ్రోన్ ఉత్పత్తి సామర్థ్యంతో సహా విస్తరిస్తున్న సైనిక పారిశ్రామిక వ్యవస్థ ఉంది. ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న తరుణంలో, ఇజ్రాయెల్ ప్రాంతంలో నిరంతర బాంబింగ్ ప్రచారాలు సాగిస్తున్న సమయంలోనే ఈ ఒప్పందం ప్రకటించడం యాదృచ్ఛికం కాదు. పశ్చిమాసియాలో అమెరికా వ్యూహాత్మక ఉనికి తగ్గుతుందన్న అంచనాల నేపథ్యంలో, ప్రాంతీయ శక్తులు సంప్రదాయ అమెరికా భద్రతా గొడుగుకు అతీతంగా కొత్త భాగస్వామ్యాల కోసం అన్వేషణ ప్రారంభించాయి. 2025 సెప్టెంబర్‌లో, ఇజ్రాయెల్ ఖతార్‌పై బాంబు దాడి చేసిన కొద్ది వారాలకే, పాకిస్తాన్, సౌదీ అరేబియా రియాద్‌లోని అల్-యమామా ప్యాలెస్‌లో ద్వైపాక్షిక వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందాన్ని (ఎస్ఎండీఏ) ప్రకటించాయి. ఇరాన్‌పై యుద్ధం, పర్షియన్ గల్ఫ్ అంతటా అమెరికా స్థావరాలపై టెహ్రాన్ ప్రతీకార దాడులు, పొరుగు ప్రాంతాల్లో ఇజ్రాయెల్ యుద్ధాలు సౌదీ అరేబియా, తుర్కియేల భద్రతా ఆందోళనలను మరింత తీవ్రతరం చేశాయి. దీంతో ఇప్పుడు వారు తరచూ ఉద్రిక్తతలతో కూడిన తమ సంబంధాలకు కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తూ, 2025 మేలో భారత్‌తో స్వల్పకాలిక వైమానిక యుద్ధం చేసిన పాకిస్తాన్‌తో కలిసి త్రైపాక్షిక వ్యవస్థను నిర్మించాలని నిర్ణయించుకున్నాయి.

పశ్చిమాసియాలో పెద్ద పాత్ర కోసం చాలాకాలంగా ప్రయత్నిస్తున్న తుర్కియేకు ఈ ఒప్పందం మరింత వ్యూహాత్మక చోటు కల్పిస్తుంది. ఇప్పటికే ఖతార్, సిరియా, లిబియాలో మిత్రపక్షాలకు విస్తరించిన తన భద్రతా గొడుగుకు, ఇది భారీ కొత్త వనరులు, సాంద్రతను జోడిస్తుంది. సాంప్రదాయకంగా భారత్ నీడలో దక్షిణాసియా ప్రాంతీయ శక్తిగా ఉన్న పాకిస్తాన్ కూడా, పశ్చిమాసియాలో భద్రతా ప్రదాత, మధ్యవర్తిగా తన పాత్రను విస్తరించుకోవాలని కోరుకుంటోంది. అయితే, ఈ మూడు దేశాల భద్రతా సవాళ్లను పరిష్కరించడంలో ఒప్పందం ఎంతమేరకు తోడ్పడుతుందో ఇప్పుడే చెప్పడం తొందరపాటే. నాటో, సీఎస్టీవో వంటి సామూహిక భద్రతా కూటములు సాధారణంగా సంఘర్షణలకు వ్యతిరేకంగా నిరోధక శక్తిని నిర్మించేందుకు, శాంతికాలంలో ఏర్పడతాయి. అయితే, మక్కా ఒప్పందానికి అతిపెద్ద బలహీనత -యుద్ధాల సమయంలోనే సంతకం చేయడం. గత ఐదు నెలల్లో, సౌదీ అరేబియా ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులను పలుమార్లు ఎదుర్కొంది, టెహ్రాన్‌కు మిత్రపక్షాలైన యెమెన్ హౌతీలు కూడా సౌదీపై దాడులు కొనసాగించారు. ప్రస్తుతం విరామంలో ఉన్న యుద్ధం మరింత తీవ్రమైతే, సౌదీ అరేబియాలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడం నుంచి ఇరాన్‌ను ఈ సామూహిక భద్రతా ప్రతిజ్ఞ


## మారుతున్న ఇసుక తిన్నెలు

నిరోధించే అవకాశం తక్కువే. అంటే, కొనసాగుతున్న సంఘర్షణలే, సామూహిక రక్షణ వాగ్దానాన్ని ప్రారంభంనుంచే ఎక్కువగా ప్రతీకాత్మకం చేసేస్తున్నాయి.

మక్కా ఒప్పందానికి సంబంధించిన మరో కీలక అంశం -దీని వెనుక దాదాపు ఏడాది కాలంగా సాగిన చర్చలు. 2023 అక్టోబర్ 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసి, గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం ప్రారంభమైన తర్వాతే ఈ చర్చలు మొదలయ్యాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతున్న తరుణంలో అవి వేగం పుంజుకున్నాయి. ఇస్లాం పవిత్ర స్థలాలకు నిలయమైన మక్కాలో, అల్-సఫా ప్యాలెస్‌లో ఒప్పందాన్ని కుదుర్చుకోవడం, కూటమి రాజకీయాలకు ఇస్లామిక్ సంఘీభావ ప్రతీకాత్మకతను జోడించిందని పరిశీలకుల అభిప్రాయం. ఇస్లామిక్ క్యాలెండర్‌లో శుక్రవారం సామూహిక ప్రార్థనల రోజునే ఈ ఒప్పందం ప్రకటించడం కూడా ఉద్దేశపూర్వకమేనన్నది విశ్లేషకుల మాట. అయితే, ఇరాన్ శాసనసభ్యుడు ఒకరు, ఈ ఒప్పందం మాత్రమే ప్రాంతీయ భద్రతను సాధించడానికి సరిపోదని రియాద్‌ను హెచ్చరించడం గమనార్హం. టర్కీ, పాకిస్తాన్‌లు ప్రాంతంలో ప్రత్యక్ష దాడులను గణనీయంగా ఎదుర్కోకపోయినా, తమ భద్రత, ఆర్థిక వ్యవస్థలను ప్రమాదంలో పడేసే ప్రాంతీయ సంఘర్షణలను చల్లార్చాలని రెండు దేశాలూ ఆసక్తిగా ఉన్నాయి. అట్లాంటిక్ కౌన్సిల్ వంటి అంతర్జాతీయ థింక్ ట్యాంకుల విశ్లేషకులు, ఈ ఒప్పందం మధ్యప్రాచ్యం, దక్షిణాసియాల్లో ఆవిర్భవిస్తున్న బహుళ ధ్రువ వ్యవస్థలో ఒక కీలక మలుపుగా అభివర్ణించారు. దీర్ఘకాలంగా అమెరికా భద్రతా ఛత్రంకిందవున్న సౌదీ వంటి దేశం, ఇప్పుడు ప్రత్యామ్నాయ భద్రతవైపు మళ్లడం, పశ్చిమాసియాలో అమెరికా ప్రభావం క్రమంగా క్షీణిస్తున్నదనడానికి సంకేతం అంటున్నారు.

భారత్ దృష్టికోణం నుంచి చూస్తే, ఈ ఒప్పందం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఎందుకంటే, 2025 మేలో భారత్‌తో వైమానిక ఘర్షణ జరిపిన పాకిస్తాన్, ఇప్పుడు అణ్వస్త్ర సామర్థ్యంలేని సౌదీ, తుర్కియేలతో తనకంటూ సామూహిక భద్రతా కవచాన్ని నిర్మించుకుంది. అణ్వాయుధ సంపన్న దేశంగా పాకిస్తాన్ ఈ కూటమిలో ప్రత్యేక స్థానంలో ఉండటం, భవిష్యత్తులో దక్షిణాసియా భద్రతా సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్నది భారత విధాన నిర్ణేతలు నిశితంగా పరిశీలించాల్సిన అంశం. చివరిగా, మక్కా ఒప్పందం విశ్వసనీయత అంతిమంగా, ఈ మూడు భాగస్వాములు తమ రాజకీయ నిబద్ధతను ఒక విశ్వసనీయమైన నిరోధక శక్తిగా మార్చగలరా? అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. యుద్ధం మధ్యలో పుట్టిన ఈ కూటమి, తన తొలి పరీక్షను ఎదుర్కొనేలోపే తన అసలైన బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. మాటల్లో సామూహిక రక్షణ వాగ్దానం ఇవ్వడం సులభమే అయినా, క్షేత్రస్థాయిలో అది వాస్తవ నిరోధక శక్తిగా మారేందుకు మూడు దేశాల మధ్య సైనిక సమన్వయం, వనరుల భాగస్వామ్యం, రాజకీయ ఏకాభిప్రాయం అవసరం. ఇవన్నీ ఇప్పటికీ పరీక్షకు నోచుకోలేదు. ఇసుక తిన్నెలు నిరంతరం మారుతున్న ఈ ప్రాంతంలో, నిజమైన భద్రత సాధించాలంటే, ప్రకటనలకు మించిన ఆచరణాత్మక సన్నద్ధత అవసరమని రాబోయే రోజుల్లో ఈ కూటమి నిరూపించుకోవాల్సి ఉంటుంది!!

### పనికొచ్చే పలుకు



## పక్కదార్లు పట్టొద్దు.. నీ దారి నీదే..!

జీవితం మనల్ని ఎన్నో ఊహించని దారుల్లోకి తీసుకెళ్తుంది, కానీ ఆ దారుల్లో ఏది ఎంచుకోవాలో నిర్ణయించే హక్కు మాత్రం మనదే. అమెరికన్ రచయిత్రి గేల్ ఫోర్మన్ చెప్పిన ఈ సూక్తి, పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా వ్యక్తిగత ఎంపికే గమ్యాన్ని నిర్దేశిస్తుందని గుర్తుచేస్తుంది. సోషల్ మీడియా యుగంలో ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ మనల్ని మనం తక్కువ చేసుకునే ధోరణి పెరుగుతున్న వేళ, ఈ మాటలు కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. కెరీర్ మలుపులు, బంధాల్లో మార్పులు, అలవాట్ల సవరణ -ప్రతి చిన్న నిర్ణయమూ జీవితాన్ని కొత్త దిశగా మళ్లించగలదు. సరైన దారి కోసం ఎదురుచూస్తూ కూర్చోవడం కంటే, ప్రస్తుత అవకాశాలతోనే ఉత్తమ నిర్ణయం తీసుకోవడమే విజయ రహస్యం. ఒకవేళ తప్పు జరిగినా, అదే జీవితం ముగింపు కాదని, ప్రతి మలుపూ మరో కొత్త అవకాశాన్నే తెస్తుందని ఈ సూక్తి భరోసా ఇస్తుంది.

ప్రసిద్ధ అమెరికన్ రచయిత్రి గేల్ ఫోర్మన్ రాసిన అద్భుతమైన సూక్తి మానవ జీవితంలో 'వ్యక్తిగత ఎంపిక' ప్రాధాన్యతను గుర్తుచేస్తోంది. పరిస్థితులు మన ప్రయాణాన్ని మార్చినా, మనం తీసుకునే నిర్ణయాలే మన గమ్యాన్ని నిర్దేశిస్తాయన్నది ఆమె రాసిన కోట్‌లోని అద్భుత సందేశం. "జీవితం అనేది ఒక చాక్లెట్ బాక్స్ లాంటిది. అందులో ఏముందో ఎవరికీ తెలియదు" అని 'ఫారెస్ట్ గంప్' సినిమాలో ప్రసిద్ధ డైలాగ్ ఉంటుంది. జీవితంలో చాలా అవకాశాలు మన ముందస్తు ప్రణాళికలు లేకుండానే వస్తాయి. అలాగే ఊహించని ఎదురుదెబ్బలు మనల్ని వేరే దారి పట్టేలా చేస్తాయి. ఇలాంటి అనిశ్చిత పరిస్థితులలో, ప్రసిద్ధ రచయిత్రి గేల్ ఫోర్మన్ చెప్పిన ఒక మాట మనకు జీవిత సత్యాన్ని గుర్తుచేస్తోంది.

'దారి ఏదైనా ఎంపిక నీదే'.. అనేది ఆలోచింపజేసే గేల్ ఫోర్మన్ జీవిత సూక్తి. అంటే -'జీవితం మిమ్మల్ని వేర్వేరు దారుల్లోకి తీసుకెళ్లవచ్చు. కానీ ఏ దారిలో వెళ్లాలో నిర్ణయించుకునే అవకాశం మీకే ఉంటుంది' అన్నది ఆమె భావన. ఫోర్మన్ చెప్పిన ఈ మాటల వెనుక బాధ్యత, సరైన ఎంపిక అనే రెండు ముఖ్యమైన అంశాలున్నాయి. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మన ప్రయాణాన్ని శాసించినప్పటికీ, మన గమ్యస్థానాన్ని అవే నిర్ణయించాల్సిన అవసరం లేదు. కొత్త కెరీర్‌ను ఎంచుకోవడం, నచ్చని బంధాలనుంచి బయటకు రావడం, లేదా చెడు అలవాట్లు మార్చుకోవడం.. ఇలా మనం తీసుకునే ప్రతి చిన్న నిర్ణయం మన జీవితాన్ని ఒక కొత్త మలుపు తిప్పుతుంది. సరైన దారి కోసం ఎదురుచూస్తూ కాలం గడపడం కంటే, ప్రస్తుతం ఉన్న అవకాశాలతోనే ఉత్తమమైన నిర్ణయాలు తీసుకోవాలని ఫోర్మన్ చెబుతున్నారు. మన జీవిత గమనం కేవలం అదృష్టం మీదే కాకుండా, రోజువారీ జీవితంలో మనం చేసే ఎంపికలపైనే ఆధారపడి ఉంటుంది.

సోషల్ మీడియా యుగంలో ఉన్న మనం, ఇతరుల జీవితాల్లోని సంతోషకరమైన క్షణాలను చూస్తూ తరచుగా మనల్ని తక్కువ చేసుకుంటుంటాం. పక్క దారే బాగుందనే భ్రమలో బతుకుతుంటాం. కెరీర్ సవాళ్లు, ఆర్థిక ఇబ్బందులు, సాంకేతిక మార్పుల వల్ల భవిష్యత్తు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని అయోమయం ప్రతి ఒక్కరిలోనూ నెలకొంది. ఇలాంటి సమయంలో ఫోర్మన్ మాటలు మనకు సరికొత్త ఆలోచనను ఇస్తాయి. విజయం అనేది ఎప్పుడూ ముందుగా నిర్ణయించిన దారిలో వెళ్లడంవల్ల మాత్రమే రాదు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం ద్వారానే అద్భుతమైన విజయాలు సాధించవచ్చని సూక్తి గుర్తుచేస్తుంది. ఒకవేళ తప్పుడు నిర్ణయం తీసుకున్నా జీవితం ముగిసిపోలేదని, ప్రతి కొత్త మలుపు మరో కొత్త అవకాశాన్ని ఇస్తుందని ఇది మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది.

# చిన్న నమ్మకం.. పెద్ద అనుమానం!?





యూపీఐ ద్వారా చెల్లింపులు చేసే సాధారణ యూజర్లపై ఎలాంటి లావాదేవీ చార్జీలు విధించబోమని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. వ్యక్తిగత లావాదేవీలు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని, భవిష్యత్తులో వ్యాపార రాయితీ రేటు (మర్చంట్ డిస్కౌంట్ రేట్ -ఎండీఆర్) అమలైనా, అది కేవలం ఎంపిక చేసిన కొన్ని వ్యాపార లావాదేవీలపై, ఒక నిర్దిష్ట పరిమితికి మించిన విలువపై మాత్రమే నామమాత్రపు రేటుతో విధిస్తారని ప్రభుత్వం వివరించింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్ 2007లో సెక్షన్ 10ఏ సవరణ కోసం ప్రతిపాదించిన టాక్సేషన్ అండ్ అదర్ లాస్ (సవరణ) బిల్లు 2026, ఆగస్టు 6న లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. దీన్ని చర్చ లేకుండా, సభలో గందరగోళం మధ్యే ఆమోదించడం గమనార్హం. ఈ బిల్లు, నోటిఫై చేసిన ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలపై చార్జీలు నిషేధించే ప్రస్తుత చట్టపరమైన నిబంధనను తొలగిస్తుంది. బిల్లు ఉభయ సభల ఆమోదం పొంది చట్టంగా మారిన తర్వాత, యూపీఐ, ఇతర డిజిటల్ చెల్లింపు విధానాలపై ఎండీఆర్ వసూలు చేసేందుకు బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలకు అనుమతి ఇచ్చే హక్కు ప్రభుత్వానికి లభిస్తుంది. అయితే, ఎండీఆర్ అమలు చేయాలా వద్దా? చేస్తే దాని రేటు ఎంత ఉండాలనే దానిపై తుది నిర్ణయం ఎన్‌పీసీఐ నేతృత్వంలోని యూపీఐ, సర్వీస్ స్టీరింగ్ కమిటీ తీసుకుంటుందని కేంద్రం స్పష్టం చేసింది. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సైతం, ప్రస్తుతం ఎండీఆర్ గురించి చర్చించడం "తొందరపాటు" అని వ్యాఖ్యానించారు.

అయితే, ప్రభుత్వం పదేపదే స్పష్టత ఇచ్చినప్పటికీ, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై దేశంలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. యూపీఐ లావాదేవీలపై ఫీజురహిత విధానాన్ని తొలగించడానికి ఈ సవరణ మార్గం సుగమం చేస్తుందని, భవిష్యత్తులో డిజిటల్ చెల్లింపులపై ఎండీఆర్ విధించే అవకాశాన్ని పెంచుతుందని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ ఆరోపించారు. ఇలాంటి రుసుము అంతిమంగా సాధారణ యూజర్లపైనే భారంగా మారుతుందని ఆయన వాదించారు. దీనిపై స్పందించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఎండీఆర్ కేవలం వ్యాపారులకు మాత్రమే వర్తిస్తుందని, సాధారణ వినియోగదారులకు కాదని పునరుద్ఘాటించారు. దీనివల్ల బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలు మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, భద్రతపై మరింత పెట్టుబడి పెట్టగలుగుతాయని, ఇది అంతిమంగా యూపీఐ యూజర్లందరికీ ప్రయోజనం చేకూరుస్తుందని ఆమె పేర్కొన్నారు. బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా చర్చలో పాల్గొనివుంటే, ఈ అంశాన్ని సభలోనే స్పష్టం చేసేవారమని కూడా ఆమె వ్యాఖ్యానించారు. ఆర్థికవేత్త జయతీ ఘోష్ సైతం, మంత్రి ప్రకటనలోని ఆర్థిక తర్కాన్ని పక్కనపెట్టినా, అంతిమ భారం వినియోగదారులపైనే పడుతుందని అభిప్రాయపడ్డారు. యూపీఐ వినియోగించే వ్యాపారుల్లో అత్యధికులు చిన్న వర్తకులేనని, వారిపై పడే భారం ధరల రూపంలో సామాన్యులకు బదిలీ అవుతుందని ఆమె వాదించారు. దీనికి భిన్నంగా, పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ఒక పత్రంలో, వినియోగదారులు, చిన్న వ్యాపారుల యూపీఐ లావాదేవీలపై ఎలాంటి రుసుము ఉండదని, భవిష్యత్తులో పెద్ద వ్యాపారులపై ఏదైనా రుసుము విధించినా యూజర్లు అదనంగా చెల్లించాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేసింది. యూపీఐ ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపుల వ్యవస్థగా అవతరించిన నేపథ్యంలో, దాన్ని సురక్షితంగా, సజావుగా నడపడానికి నిరంతర పెట్టుబడి అవసరమని, ప్రస్తుతం ఈ వ్యవస్థ ఖర్చును బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలే భరిస్తున్నాయని కౌన్సిల్ పేర్కొంది.

ఈ వివాదానికి మరో కోణం కూడా ఉంది. అమెరికా ఒత్తిడికి భారత్ లొంగిపోతోందన్న ఆరోపణ. 2026 మార్చిలో విడుదలైన అమెరికా విదేశీ వాణిజ్య అవరోధాల నివేదిక, భారత్‌లో యూపీఐ, రూపేలకు వర్తించే జీరో ఎండీఆర్ విధానాన్ని వ్యతిరేకించిందని, ఇది వీసా, మాస్టర్‌కార్డ్ వంటి అమెరికా చెల్లింపు కంపెనీలకు అసమాన పోటీ వాతావరణాన్ని సృష్టిస్తోందని అమెరికా భావిస్తున్నట్టు నివేదికలు వెల్లడించాయి. వాణిజ్య వ్యవహారాల థింక్ ట్యాంక్ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) డైరెక్టర్ అజయ్ శ్రీవాస్తవ ప్రకారం, జీరో ఎండీఆర్ విధానం, రూపే ప్రోత్సాహం, డేటా స్థానికీకరణ నిబంధనలు, యూపీఐ యాప్‌లకు ఎన్‌పీసీఐ ప్రతిపాదించిన 30 శాతం మార్కెట్ వాటా పరిమితిపై అమెరికా అభ్యంతరం వ్యక్తం చేసింది. అమెరికా ఒత్తిడికి లొంగి భారత్ తన దేశీయ చెల్లింపు వ్యవస్థలపై విధానాలు మార్చుకోకూడదని జీటీఆర్ఐ సూచించింది. అయితే, యూపీఐ నిర్వహణ, భద్రత, సైబర్ సెక్యూరిటీ, మోసాల నివారణ ఖర్చులు గణనీయంగా ఉన్నందున, దీర్ఘకాలంలో నిలకడైన ఆర్థిక నమూనా అవసరం కావచ్చని కూడా థింక్ ట్యాంక్ అంగీకరించింది. దీనికి భిన్నంగా, బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జ్ అమిత్ మాలవీయ, ఈ ఆరోపణలు నిరాధారమైనవని, గతంలోనూ యూపీఐపై విదేశీ చెల్లింపు సంస్థల నుంచి అభ్యంతరాలు వచ్చినా భారత్ ఎన్నడూ వెనక్కి తగ్గలేదని వాదించారు. 2018లో మాస్టర్‌కార్డ్ అధికారికంగా ఫిర్యాదు చేసినా భారత్ తన విధానం మార్చుకోలేదని గుర్తుచేశారు. చెల్లింపుల పరిశ్రమకు చెందిన సీనియర్ అధికారుల ప్రకారం, 95 శాతానికి పైగా యూపీఐ చెల్లింపులపై ఎలాంటి రుసుములు ఉండవని, ఈ మార్పులకు భారత్-అమెరికా వాణిజ్య చర్చలతో సంబంధం లేదని కూడా స్పష్టం చేశారు.

చివరిగా, ఈ వివాదంలో నిజమైన ప్రమాదం ఎక్కడుందో గమనించాలి. చట్టపరమైన నిబంధన తొలగించడం, వెంటనే రుసుములు విధించడం రెండూ వేర్వేరు విషయాలు. ప్రస్తుతానికి యూజర్లపై ఎలాంటి భారం పడదని అన్ని పక్షాలూ అంగీకరిస్తున్నా, భవిష్యత్తులో పెద్ద వ్యాపారులపై విధించే రుసుములు, పరోక్షంగా ధరల పెంపు రూపంలో సామాన్యులపైనే పడే అవకాశం ఉందన్న ప్రతిపక్షాల ఆందోళనను పూర్తిగా కొట్టిపారేయలేం. అదే సమయంలో, ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహించడానికి అవసరమైన నిధులను, కేవలం ప్రభుత్వ రాయితీలపైనే ఆధారపడకుండా, స్థిరమైన ఆర్థిక నమూనా ద్వారా సమకూర్చుకోవాల్సిన అవసరాన్ని కూడా విస్మరించలేం. అయితే, ఈ కీలకమైన నిర్ణయాన్ని పార్లమెంటులో సరైన చర్చ లేకుండా, గందరగోళం మధ్యే ఆమోదించడం ప్రజాస్వామిక ప్రక్రియకు తగినది కాదు. యూపీఐ విజయగాథలో జీరో ఎండీఆర్ విధానానిదే కీలక పాత్ర అయినందున, భవిష్యత్తులో ఏదైనా మార్పు చేసేముందు, అది సామాన్య వినియోగదారులపై ఎలాంటి పరోక్ష భారం మోపకుండా, పారదర్శకంగా, విస్తృత సంప్రదింపులతో నిర్ణయం తీసుకోవడమే సముచితం. ■



ఎప్పుడు అవకాశం వచ్చినా వెంటనే నవ్వండి. ఆ నవ్వును నలుగురితో పంచుకోండి. ఎందుకంటే, చిన్న చిరునవ్వు శరీరంలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. శరీరంలోని రసాయనిక వ్యవస్థను (ఫిజియోలాజికల్ కెమిస్ట్రీ) సానుకూలంగా మారుస్తుంది. ఒక్క నవ్వు, ఒత్తిడి హార్మోన్లను తగ్గించి, ఆనంద రసాయనాలను విడుదల చేస్తుంది. ఇది ఖరీదైన ఔషధం కంటే శక్తివంతమైన చికిత్స. అందుకే బాధలో ఉన్నా, ఒక్క క్షణం నవ్వగలిగే ధైర్యం చేయండి. ఆ నవ్వే మీలోని యుద్ధాన్ని సగం గెలిపిస్తుంది. నవ్వు పంచేకొద్దీ పెరిగే అరుదైన సంపద, దాన్ని ఈరోజే పంచడం మొదలుపెట్టండి.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## చికెన్‌లో వింత వస్తువు




అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఒక జంట, ప్రముఖ ఫాస్ట్‌ఫుడ్ చైన్ 'పాపేస్'పై 15 లక్షల డాలర్లకు పైగా నష్టపరిహారం కోరుతూ దావా వేసింది. హ్యూస్టన్‌లోని ఒక పాపేస్ షాపులో జూలై 25న కొనుగోలు చేసిన చికెన్ ముక్కలో కండోమ్‌ను పోలిన వస్తువు ఇమిడి ఉన్నట్టు గుర్తించామని జస్టిన్ హోవార్డ్, డానియెల్ మెక్‌కిన్నన్ దంపతులు పేర్కొన్నారు. దీంతో వికారం, తీవ్ర మానసిక క్షోభకు గురయ్యామని, ఫిర్యాదు చేసినప్పుడు సిబ్బంది సీరియస్‌గా తీసుకోకుండా అపహాస్యం చేశారని ఆరోపించారు. వెంటనే డబ్బు వాపసు చేయకుండా, పదేపదే కొత్త చికెన్ ఇచ్చేందుకే సిబ్బంది ప్రయత్నించారని దావాలో పేర్కొన్నారు. అయితే, తమ అంతర్గత సీసీటీవీ ఫుటేజీలో ఈ ఆరోపణకు ఎలాంటి ఆధారాలు కనిపించలేదని పాపేస్ యాజమాన్యం స్పష్టం చేసింది.

# కండలు సరే..కిడ్నీలు భద్రం



శరీర సౌష్ఠవాన్ని, సామర్థ్యాన్ని మెరుగు పరచుకోవాలని ఎవరికి ఉండదు? మంచి బలంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తే కలిగే ఆత్మ విశ్వాసమే వేరు. అందుకే చాలామంది ఇప్పుడు జిమ్‌ల మీద ఆసక్తి చూపుతున్నారు. కసరత్తులతో కండలు పెంచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. కాకపోతే కొందరు.. ముఖ్యంగా యువత కృత్రిమంగా, అసహజ పద్ధతులతో అతి వేగంగా కండలు పొంగించుకోవాలని తాపత్రయ పడటమే చిక్కులు తెచ్చిపెడుతోంది. ప్రొటీన్ పొడులు, ప్రొటీన్ మిల్క్‌షేక్‌లు, క్రియాటిన్, అనబాలిక్ స్టెరాయిడ్లు, నొప్పి మందుల వాడకం పెద్ద నష్టమే కలిగిస్తోంది. రక్తాన్ని శుద్ధి చేసి, శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచే కిడ్నీల మీద ఇవి అదనపు భారాన్ని పడేస్తున్నాయి. చివరికి కిడ్నీలు దెబ్బతినే పరిస్థితికీ దారితీస్తుండటం ఆందోళనకరం.

అతడి వయసు 25. ఆరేళ్లుగా జిమ్‌కు వెళ్తున్నాడు. కండలు పెద్దగా పెరగటానికి క్రియాటిన్, ప్రొటీన్ పొడి తీసుకోవాలని అక్కడి ట్రెయినర్ సూచించాడు. నిజమే కాబోలని వాడటం మొదలెట్టాడు. ఒకరోజు కళ్లు తిరగటం, అలసటగా అనిపించింది. పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ మళ్లీ ఇబ్బంది పడుతుండటంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్తంలో క్రియాటినిన్ మోతాదు పెరగటంతో రెండుసార్లు డయాలసిస్ చేయాల్సి వచ్చింది. అదృష్టం కొద్దీ కిడ్నీ పాడవలేదు. కానీ కిడ్నీ నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షిస్తే– రక్తాన్ని వడపోసే కిడ్నీల్లోని భాగాలు చాలావరకూ దెబ్బతిన్నట్టు, మూసుకుపోయినట్టు తేలింది. ఒకవేళ ఆసుపత్రికి రావటం కొద్దిరోజులు ఆలస్యమైనట్టయితే కిడ్నీ కోలుకోలేనంతగా దెబ్బతినేదే. అతిగా క్రియాటిన్, ప్రొటీన్ వాడకం వల్ల తలెత్తే అనర్థాలకు ఇదొక ఉదాహరణ. త్వరగా కండరాలను పెంచుకోవాలనే ఆశతో ఇలాంటి అనుచిత పద్ధతులను పాటించే ధోరణి యువతలో ఇటీవల పెరిగిపోతోంది. ఎంతోమంది అనబాలిక్ స్టెరాయిడ్లు, నొప్పి మాత్రలనూ వాడుతున్నారు. ఇవన్నీ కిడ్నీలను దెబ్బతీసే ప్రమాదముండటం గమనార్హం. జిమ్‌లో వ్యాయామాలు చేయటం మంచిదే అయినా జాగ్రత్తగా ఉండటమూ ముఖ్యమేనన్న సంగతి మరవరాదు.

## క్రియాటిన్ కీలక అవయవాలకు చేటు

శరీరంలోని చాలా కండరాల్లో క్రియాటిన్ ఉంటుంది. ఇది పనులు, వ్యాయామం చేస్తున్నప్పుడు కండరాలకు నిరంతరం శక్తి అందిస్తుంది. కండరాలు పుంజుకోవటానికి, త్వరగా కోలుకోవటానికీ తోడ్పడుతుంది. అందుకే జిమ్‌లకు వెళ్లేవారు ఎక్కువసేపు వ్యాయామం చేయటానికి, కండర పుష్టి కోసం పొడులు, మాత్రలు, చాక్లెట్ల రూపంలో అదనంగా వాడుతుంటారు. క్రియాటిన్ పదార్థం ఒక స్థాయి వరకూ పెద్దగా హాని చేయదు. కానీ పెద్దమొత్తంలో తీసుకుంటే మాత్రం మెదడు, కిడ్నీల వంటి కీలక అవయవాల మీద విపరీత ప్రభావం చూపుతుంది. క్రియాటిన్ విచ్ఛిన్నమయ్యే క్రమంలో క్రియాటినిన్ అనే వ్యర్థ పదార్థంగా మారుతుంది. ఇది రక్తంలో కలిసి కిడ్నీలకు చేరుకుంటుంది. దీన్ని వడగట్టటానికి కిడ్నీలు ఎక్కువ కష్టపడి పనిచేయాల్సి వస్తుంది. దీంతో కిడ్నీలు అలసిపోయి, దెబ్బతినే ప్రమాదముంది. కిడ్నీలు సరిగా వడగట్టకపోతే రక్తంలో క్రియాటినిన్ మోతాదులు పెరుగుతాయి. సాధారణంగా ఇది 0.7 నుంచి 1.2 ఎంజీ/డీఎల్ వరకూ ఉండొచ్చు. అంతకన్నా మించితే కిడ్నీ దెబ్బతింటోందనే అర్థం. పొడులు, చాక్లెట్ల రూపంలో క్రియాటిన్ తీసుకునే కొందరిలో క్రియాటినిన్ మోతాదులు 25 ఎంజీ/డీఎల్ వరకూ ఉంటుండటం.. వీరికి తాత్కాలికంగా డయాలసిస్ చేయాల్సిన అవసరమూ ఏర్పడుతుండటం గమనార్హం.

## ప్రొటీన్ కిడ్నీల మీద అదనపు భారం

జిమ్‌లకు వెళ్లేవారిలో చాలామంది వే ప్రొటీన్‌ను తీసుకోవటం ఎక్కువైంది. ఇదిప్పుడు అన్నిచోట్లా తేలికగా అందుబాటులో ఉంటోంది. ప్రొటీన్ కండరాలు పుంజుకోవటానికి తోడ్పడే మాట నిజమే అయినా అనవసరంగా, అతిగా వాడటం హానికరంగా పరిణమిస్తుంది. సాధారణంగా రోజుకు ఒక కిలో శరీర బరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. జిమ్‌కు వెళ్లేవారు తెలిసో తెలియకో 1.5 నుంచి 2 గ్రాముల వరకూ తీసుకుంటుంటారు. 5 గ్రాముల వరకూ తీసుకునేవారు లేకపోలేదు. ఇది చాలా ప్రమాదకరం. ప్రొటీన్ విచ్ఛిన్నమైనప్పుడు పుట్టుకొచ్చే యూరిక్ ఆమ్లం వంటి వ్యర్థాలను వడపోయటానికి, బయటకు పంపటానికి కిడ్నీలు ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. అప్పటికే ఊబకాయం గలవారికి, మాంసాహారులకైతే ప్రొటీన్ పొడులు మరింత చేటు చేస్తాయి. కొందరికి తక్కువ బరువుతో పుట్టటం వంటి కారణాలతో చిన్నప్పటి నుంచే కిడ్నీల్లో రక్తాన్ని వడగట్టే భాగాల సంఖ్య తక్కువగా ఉండొచ్చు. దీంతో రక్తం వడపోత ప్రక్రియ కూడా మందగిస్తుంది. కిడ్నీ పనితీరు బాగా తగ్గిపోయేంత వరకూ పైకి ఎలాంటి లక్షణాలూ కనిపించవు. అంతా బాగానే ఉందనుకుంటారు. ఇలాంటివారు తెలిసో తెలియకో అదనంగా ప్రొటీన్ పొడుల వంటివి తీసుకుంటే కిడ్నీల మీద మరింత భారం పెరుగుతుంది. క్రమంగా దెబ్బతినే ప్రమాదముంది. వీరికి మూత్రంలో సుద్ద (అల్బుమిన్) పడుతుంది కూడా. కొన్నిసార్లు ప్రొటీన్ పొడుల్లో భార లోహాలూ ఉండొచ్చు. ఇవీ దీర్ఘకాల కిడ్నీ జబ్బుకు దారితీసే ప్రమాదమూ ఉంది.

## నొప్పి మాత్రలు ఏవైనా నష్టమే

జిమ్‌లకు వెళ్లి కఠినమైన వ్యాయామాలు చేసేవారు తరచూ నొప్పులను తగ్గించే మాత్రలు వేసుకుంటుంటారు. దీంతో మరింత ఎక్కువగా వ్యాయామాలు చేస్తుంటారు. అసలు విషయం ఏంటంటే– నొప్పి మందులేవైనా కిడ్నీలకు చేటు చేయటం. ట్రెమడాల్ వంటి కొన్ని సురక్షితమైన మందులున్నప్పటికీ ఇవి గుండె సమస్యలకు దారితీయొచ్చు. కొందరికి వీటితో వెంటనే వాంతులవుతుంటాయి కూడా. డైక్లోఫెనాక్, ఐబూప్రొఫెన్ వంటి ఎన్ఎస్ఏఐడీ రకం నొప్పి మందులను చీటికీ మాటికీ వేసుకుంటే కిడ్నీలు దెబ్బతినొచ్చు. ఇవి కిడ్నీలకు రక్త సరఫరా తగ్గేలా చేయటం ద్వారా వడపోత ప్రక్రియను అస్తవ్యస్తం చేస్తాయి. రక్తంలో సోడియం, నీరు పేరుకునేలా చేస్తాయి కూడా. అందుకే నొప్పి మాత్రలు వేసుకోగానే ఉబ్బినట్టుగా కనిపిస్తారు. కొందరు దీన్ని బరువు పెరిగినట్టుగానూ పొరపడుతుంటారు.

## అనబాలిక్ స్టెరాయిడ్లు రక్తనాళాలకు దెబ్బ

స్టెరాయిడ్లు ఒక్క కండరాలు పెరగటానికే కాదు, రకరకాల పనుల్లో పాలు పంచుకుంటాయి. చాలా జబ్బుల చికిత్సల్లో స్టెరాయిడ్లు వాడుతుంటారు. వీటిల్లో ఒకరకం అనబాలిక్ స్టెరాయిడ్లు. ఇవి కండరాలు, బరువు, రక్త పరిమాణం పెంచటం వంటి మంచి పనులూ చేస్తాయి. అలాగని దీర్ఘకాలంగా, అనవసరంగా వాడితే రక్తనాళాల లోపలి పైపొర దెబ్బతింటుంది. దీంతో రక్తపోటు పెరగటం, కిడ్నీలు దెబ్బతినటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. కిడ్నీలను లోపలి నుంచి చూస్తే రక్త గుచ్ఛం మాదిరిగా ఉంటాయి. అందువల్ల రక్తనాళాలను ప్రభావితం చేసే, దెబ్బతీసే ఏ జబ్బయినా వడపోత సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. అనబాలిక్ స్టెరాయిడ్లతో గుండె కండరం మెత్తగా, బలహీనంగా అవటం మరో సమస్య. దీంతో గుండె రక్తాన్ని సరిగా పంప్ చేయలేదు. ఫలితంగా కిడ్నీల్లో వడపోత ప్రక్రియ కూడా మందగిస్తుంది. స్టెరాయిడ్లు రక్తంలో సోడియం, నీటి మోతాదు పెరిగేలా చేస్తాయి కూడా. దీంతో ఒళ్లంతా ఉబ్బినట్టు అవుతుంది. దీన్ని కొందరు బలంగానూ భావిస్తుంటారు. బరువు పెరిగామని అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. కిడ్నీలు, గుండె పనితీరు మందగించటమే కారణమని తెలుసుకోవాలి.



## ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

వీలైనంతవరకూ ఆహారం ద్వారానే నాణ్యమైన ప్రొటీన్ లభించేలా చూసుకోవాలి. మాంసాహారంతో లభించే ప్రొటీన్‌తోనే కండలు పెరుగుతాయని అనుకోవటం అపోహ. శాకాహార ప్రొటీన్ కూడా కండర పుష్టికి తోడ్పడుతుంది. చిక్కుడు జాతి కూరగాయలు, పప్పులు, పాలు, పెరుగు వంటి వాటితో ప్రొటీన్ బాగా లభిస్తుంది. నిజానికి వే ప్రొటీన్ పొడి పన్నీరు తయారీలో మిగిలిన ద్రవం నుంచే తయారు చేస్తారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కండర పుష్టికి ఇదే కీలకం. కానీ ఏవేవో పొడులు, మాత్రలు తీసుకుంటేనే కండలు పెరుగుతాయని అనుకోవద్దు. వీటితో కండ వృద్ధి చెందినా అది తాత్కాలికమేనని తెలుసుకోవాలి.

ప్రొటీన్ పొడులు, అనబాలిక్ స్టెరాయిడ్ల వంటివి తప్పనిసరిగా వాడాల్సిన పరిస్థితుల్లో విధిగా డాక్టర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. తగు పరీక్షలు చేయించుకొని, శారీరకంగా బలంగా ఉన్నట్టు తేలితే వీటిని వాడుకోవచ్చు.

శరీర సామర్థ్యాన్ని గమనించకుండా ఒక స్థాయిని మించి, గంటల తరబడీ వ్యాయామం చేయటం మంచిది కాదు. హఠాత్తుగా గుండెపోటు రావటానికి ఇదీ ఒక కారణమేనని గుర్తించాలి.

బాగా ఎండగా, వేడిగా ఉన్న చోట్ల వ్యాయామాలు చేయొద్దు.

వ్యాయామాలు చేస్తున్నప్పుడు మధ్యమధ్యలో నీళ్లు కూడా తాగాలి. కేవలం ప్రొటీన్ మిల్క్ షేక్స్‌తోనే శక్తి లభిస్తుందని అనుకోవద్దు. నీటితో లభించే శక్తి, ఉత్సాహం మరే పానీయంతోనూ రాదు.

పొటాషియం లోపం గలవారు అరటి, ఖర్జూరం వంటి పండ్లు తినటం మంచిది.

## ఇవీ ప్రమాద హెచ్చరికలు

కళ్లు తిప్పినట్టు, తల తేలిపోతున్నట్టు అనిపించటం.

త్వరగా అలసిపోవటం, నిస్సత్తువ, నీరసం.

మూత్రం అంతగా రాకపోవటం.

పాదాలు, చీలమండలు, ముఖం, చేతులు ఉబ్బటం.

రాత్రిపూట తరచూ మూత్రానికి వెళ్లాల్సి రావటం.

**ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయరాదు.**

## వీరు వాడొద్దు

మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు గలవారు.

నెలలు నిండక ముందే పుట్టినవారు, పుట్టుకతో తక్కువ బరువుతో ఉన్నవారు.

పొగ తాగే అలవాటు గలవారు.

ఊబకాయం గలవారు.

ఇలాంటివారు తక్కువ కాలంలో కండలు, బరువు పెరగటానికి క్రియాటిన్, ప్రొటీన్ వాడకపోవటమే మంచిది.

# ఐసీసీపై మండిపడుతున్న చిన్న జట్లు.. అసలేమిటీ వరల్డ్ కప్ ఫార్మాట్ వివాదం?

**పురుషుల వన్డే ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ఫార్మాట్‌లో మార్పులు**

**ఐసీసీ నిర్ణయంపై స్కాట్లాండ్, నెదర్లాండ్స్ బోర్డుల తీవ్ర అసంతృప్తి**

**చిన్న జట్లకు అవకాశాలు తగ్గించేలా కొత్త నిబంధనలు ఉన్నాయని ఆరోపణ**

**కనీస సమాచారం లేకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని విమర్శ**

**నిర్ణయంపై పునరాలోచించాలని ఐసీసీని కోరిన అసోసియేట్ దేశాలు**



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీసుకున్న ఒక అనూహ్య నిర్ణయం క్రికెట్ ప్రపంచంలో తీవ్ర దుమారం రేపుతోంది. పురుషుల వన్డే ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియలో, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఆకస్మికంగా మార్పులు చేయడంపై స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇది అసోసియేట్ దేశాల (చిన్న జట్లు) క్రికెట్ అభివృద్ధికి పెద్ద దెబ్బ అని, ప్రపంచవ్యాప్తంగా ఆటను విస్తరించే ప్రయత్నాలకు ఇది గొడ్డలిపెట్టు అని హెచ్చరించాయి.

**ఏమిటీ కొత్త మార్పులు?**

గత జులైలో ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ వార్షిక సమావేశం తర్వాత ఈ మార్పులను ప్రకటించారు. వాస్తవానికి, ఈ టోర్నమెంట్‌లో 14 జట్లు పాల్గొనాలి. వాటిని ఏడేసి జట్లుగా రెండు గ్రూపులుగా విభజించి, ఆ తర్వాత 'సూపర్ సిక్స్' దశ నిర్వహించాల్సి ఉంది. కానీ, ఐసీసీ ఇప్పుడు 'సూపర్ సిరీస్', 'సూపర్ 7' అనే కొత్త దశలను ప్రవేశపెట్టింది.

ఈ కొత్త విధానం ప్రకారం, క్వాలిఫయింగ్ రౌండ్‌లో చివరి మూడు స్థానాల్లో (12, 13, 14) నిలిచిన జట్లు మొదట 'సూపర్ సిరీస్' ఆడతాయి. ఇందులో గెలిచిన ఒక్క జట్టు మాత్రమే తర్వాతి దశకు అర్హత సాధిస్తుంది. ఆ తర్వాత, టాప్ 11 జట్లతో కలిసి మొత్తం 12 జట్లను ఆరేసి చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్ 3 జట్లతో పాటు, ఆ తర్వాత ఉత్తమ ప్రదర్శన కనబరిచిన మరో జట్టుతో కలిపి మొత్తం ఏడు జట్లు 'సూపర్ 7' దశలో ఆడతాయి. ఈ ఏడు జట్ల మధ్య జరిగే రౌండ్ రాబిన్ మ్యాచ్‌ల ఆధారంగా సెమీ ఫైనలిస్టులను నిర్ణయిస్తారు.

**చిన్న జట్లకు నష్టమా?**

ఈ మార్పుల వల్ల అసోసియేట్ దేశాలు తీవ్రంగా నష్టపోతాయని స్కాట్లాండ్, నెదర్లాండ్స్ బోర్డులు ఆందోళన వ్యక్తం చేశాయి. టోర్నమెంట్ ప్రారంభానికి కేవలం 18 నెలల ముందు ఇలాంటి కీలక మార్పులు చేయడం దారుణమని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. ముఖ్యంగా పరిమిత వనరులతో నడిచే చిన్న దేశాలపై ఇది పెను భారం మోపుతుంది. ఏళ్ల తరబడి ఒకే క్వాలిఫికేషన్ విధానం ఉంటుందని నమ్మి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు, శిక్షణ, ఆర్థిక ఏర్పాట్లు చేసుకున్న జట్లకు ఈ ఆకస్మిక మార్పులు కోలుకోలేని దెబ్బ. వారి ప్రణాళికలన్నీ తలకిందులవుతాయి. కొత్త ఫార్మాట్‌కు అలవాటుపడటానికి, వ్యూహాలు మార్చుకోవడానికి సమయం ఉండదు. ఇది వారిపై అదనపు ఆర్థిక, నిర్వహణ ఒత్తిడిని పెంచుతుంది. ప్రపంచకప్‌లో ఆడే అవకాశం వస్తేనే స్పాన్సర్లు, ప్రభుత్వాల నుంచి నిధులు, యువ ఆటగాళ్లలో స్ఫూర్తి వస్తాయి. కానీ, అర్హత సాధించే మార్గాన్ని ఇంత కఠినతరం చేస్తే, ఆ దేశాల్లో క్రికెట్ అభివృద్ధి కుంటుపడుతుంది.

**ఐసీసీ తీరుపై తీవ్ర విమర్శలు**

"క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలని చెబుతూనే, వర్ధమాన దేశాలకు అవకాశాలు తగ్గించడం తప్పుడు సంకేతాలు పంపుతుంది. కనీసం మాతో చర్చించకుండా, మా అభిప్రాయాలు తీసుకోకుండా ఇంత పెద్ద నిర్ణయం ఎలా తీసుకుంటారు?" అని బోర్డులు ప్రశ్నించాయి. ఈ నిర్ణయాల వెనుక పారదర్శకత లోపించిందని, ఇది అంతర్జాతీయ క్రికెట్ సమగ్రతను దెబ్బతీస్తుందని ఆరోపించాయి. ఈ మార్పుల గురించి ఎడిన్‌బర్గ్ సమావేశంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఇది తమకు పిడుగుపాటులాంటి వార్త అని ఓ అసోసియేట్ దేశ అధికారి తెలిపారు. మార్పుల ప్రకటన తర్వాత ఐసీసీతో రెండుసార్లు సమావేశమైనా, లిఖితపూర్వకంగా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, రెండు వారాలుగా ఐసీసీ నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం నిరాశపరిచిందని, ఇది తమను అగౌరవపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశాయి. గతంలో అసోసియేట్ దేశాలు పెద్ద జట్లను ఓడించి సృష్టించిన సంచలనాలు టోర్నమెంట్‌కే వన్నె తెచ్చాయని గుర్తుచేశాయి. ఆటలో ప్రతిభే గెలవాలనే సూత్రానికి ఈ మార్పులు విరుద్ధమని పేర్కొన్నాయి. ఐసీసీ వెంటనే ఈ విషయంపై అసోసియేట్ సభ్యులతో చర్చలు జరిపి, ప్రపంచ క్రికెట్ ప్రయోజనాలను కాపాడాలని ఆ బోర్డులు డిమాండ్ చేశాయి.

# హార్దిక్ పాండ్యా కోసం CSK, KKR మాస్టర్ ప్లాన్.. ఈ ఆల్ రౌండర్ అవసరం ఏవరికి .?




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ప్రపంచంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు ఒకే ఒక్క న్యూస్ హాట్ టాపిక్‌గా మారింది. అదే ఐపీఎల్ స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ డీల్ రూమర్స్. గత కొన్ని సీజన్లుగా ముంబై జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో, హార్దిక్ పాండ్యా ఫ్రాంచైజీని వీడనున్నారనే వార్తలు క్రికెట్ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ట్రేడ్ విండోలో భాగంగా, ఈ విధ్వంసకర ఆల్‌రౌండర్‌ను సొంతం చేసుకునేందుకు ఐపీఎల్‌లోని రెండు పవర్ పౌస్ జట్లు తీవ్రంగా పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. అందులో మొదటిది ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) కాగా, రెండోది కోల్‌కతా నైట్ రైడర్స్ (ఖఖ=). ముంబై ఇండియన్స్ నుంచి హార్దిక్‌ను దక్కించుకోవడానికి సీఎస్కే భారీ ప్లేయర్ స్వాప్ డీల్‌ను తెరపైకి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శివమ్ దూబేతో పాటు మరికొందరు ఆటగాళ్లు లేదా భారీ నగదుతో కూడిన ప్యాకేజీని ముంబైకి ఆఫర్ చేసేందుకు చెన్నై సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు, కేకేఆర్ కూడా కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించే లక్ష్యంతో హార్దిక్ ట్రేడింగ్ రేసులో గట్టి పోటీ ఇస్తోంది. అయితే, భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఈ ట్రేడింగ్ రూమర్లపై ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. ముంబై ఇండియన్స్ లాంటి అగ్రశ్రేణి ఫ్రాంచైజీ తమ ప్రత్యర్థులైన సీఎస్కే లేదా కేకేఆర్‌లను మరింత బలపరిచేందుకు హార్దిక్‌ను సులభంగా వదులుకుంటుందా అనే ప్రశ్న ఇప్పుడు కీలకంగా మారింది. ముంబై మేనేజ్‌మెంట్ ఎలాంటి ప్రతిపాదన లేకుండా ఈ డీల్‌కు ఒప్పుకునే అవకాశం లేదని, కేవలం తమ జట్టుకు సమానమైన లేదా అంతకంటే మెరుగైన ప్రయోజనం చేకూరితేనే ఈ ట్రేడ్ సాధ్యమవుతుందని క్రికెట్ నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, ఈ మెగా ట్రేడింగ్ వార్ ఐపీఎల్ వేలానికి ముందే వాతావరణాన్ని వేడెక్కించింది. మరి ఈ ఉత్కంఠ పోరులో హార్దిక్ పాండ్యా భవిష్యత్తు ఎటువైపు మొగ్గు చూపుతుందో వేచి చూడాలి.

# గోల్ కొట్టిన సంబరంలో టన్నెల్‌లో పడిపోయిన బ్రెజిల్ ఫుట్ బాల్ ప్లేయర్..



గోల్ కొట్టిన సంబరంలో బాల్ చేతబట్టిన ప్లేయర్ జేసీ.. తన సపోర్టర్స్ వైపు పరిగెత్తాడు. సెలబ్రేషన్స్ లో భాగంగా పిచ్ గోడను దూకడంతో పక్కనే ఉన్న సొరంగంలోకి పడిపోయాడు. ఆ తర్వాత సెలబ్రేషన్స్ ఆపకుండా సొరంగం నుంచి బయటకు వచ్చి అదే రేంజ్ లో సెలబ్రేషన్స్ చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ కూడా ఆడాడు. అయితే యాంకిల్ (కాలి చీలమండ) విరిగిపోవడంతో మ్యాచ్ నుంచి సబ్ స్టిట్యూట్ చేశారు. జేసీ లేకపోయినా.. కొరిటిబా టీమ్.. కేప్ కొఎన్స్ పై 2-1 తేడాతో గెలిచింది.

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫుట్ బాల్ గేమ్ సందర్భంగా ఒక ప్లేయర్ గోల్ కొడితే ఎంత సంబరం ఉంటుందే ఇటీవలే ఫిఫా వరల్డ్ కప్ చూసినోళ్లకు అర్థం అవుతుంది. వరల్డ్ కప్ అయినా.. చిన్న లీగ్ మ్యాచ్ అయినా అంతే కసితో ఆడుతుంటారు ఫుట్ బాల్ ప్లేయర్లు. గోల్ చేస్తే మ్యాచ్ గెలిచినంత ఆనందం పొందే ప్లేయర్ల సెలబ్రేషన్స్ వేరే లెవెల్ లో ఉంటాయి. అలాంటి సెలబ్రేషన్సే ఈ ప్లేయర్ పాలిట విషాదంగా మారాయి. బ్రెజిల్ టాప్ ఫ్లైట్ ఫుట్ బాల్ కాంపిటిషన్ సందర్భంగా.. కొరిటిబా డిఫెండర్ జేసీ మరన్హావో గోల్ కొట్టిన ఆనందంలో టన్నెల్ లో పడిపోవడం అందరినీ షాకింగ్ కు గురిచేసింది. పిచ్ కు పక్కనే ఉన్న టన్నెల్ లో పడిపోవడంతో మ్యాచ్ ఆందోళన కరంగా ముగిసింది.

బ్రెజిల్ సిరీ-ఎ మ్యాచ్ లో భాగంగా కేప్ కోయెన్స్ టీమ్ పై కొరిటిబా 41వ నిమిషంలో కొట్టిన గోల్ తో 2-0 తేడాతో గెలుపు దిశగా దూసుకెళ్లింది.

**పిచ్ పక్కన సొరంగం ఎందుకు..?**

ఫుట్ బాల్ లో పిచ్ కు డ్రెస్సింగ్ రూమ్ ను కనెక్ట్ చేస్తూ టన్నెల్ ఉంటుంది. ప్లేయర్లు డ్రెస్సింగ్ రూమ్ నుంచి నేరుగా టన్నెల్ ద్వారా పిచ్ కు చేరుకుంటారు. 2014 లో కూడా ఇలాంటి ఘటనే ఒకటి జరిగింది. క్యామెరూన్ స్ట్రైకర్ జోయెల్ కూడా అప్పట్లో బ్యారియెర్స్ పై నుంచి జంప్ చేయడంతో టన్నెల్ పడిపోయాడు. ఆ మ్యాచ్ లో కొరిటిబా సవో పావ్లో టీమ్ పై 3-1 తేడాతో గెలిచింది. ఇద్దరూ పడిన టన్నెల్ ఇదే కావడం గమనార్హం. అనూహ్యంగా జరిగినా.. ఇద్దరు ప్లేయర్లు ఒకే టన్నెల్ పడిపోవడం ఆశ్చర్యం. 2014 తర్వాత మరో 12 ఏళ్లకు అదే టన్నెల్ మరో ప్లేయర్ పడటం యాదృచ్ఛికంగా ఉందని బ్రెజిల్ జర్నలిస్ట్ లియోనార్డో మెండెస్ జూనియర్ అన్నారు.



# ఫౌజీ నుంచీ గూస్ బంప్స్ తెప్పించే న్యూస్.. 3 వారాల పాటూ.. సినిమాకే హైలెట్!




రెబల్ స్టార్ ప్రభాస్ నుండి ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'ఫౌజీ'. 'సీతారామం' వంటి బ్యూటిఫుల్ లవ్ స్టోరీ తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రముఖ డైరెక్టర్ హను రాఘవపూడి.. ఈసారి భారతదేశానికి స్వాతంత్రం రాక పూర్వం ఒక సైనికుడి గాథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా.. ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ ఇమాన్వి తొలిసారి వెండితెరకు పరిచయమవుతూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం ఫౌజీ.

**పలుమార్లు వాయిదా పడ్డ ఫౌజీ**

నిజానికి ఆగస్టు 14వ తేదీనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. ఇప్పటికీ పలుమార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఇంకా ఈ సినిమా షూటింగ్ కొంత భాగం మిగిలి ఉండడం గమనార్హం. ఇలాంటి సమయంలో ఈ సినిమా నుంచి ఈ మధ్య అప్డేట్స్ వదులుతూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు మేకర్స్. అందులో భాగంగానే ఈ సినిమా షూటింగ్ గత కొద్ది రోజులుగా హైదరాబాద్లోని కోకాపేటలో షూటింగ్ జరిగింది. ఒక దేవాలయంలో బ్రాహ్మణులు వేడుక చేసుకుంటుండగా.. బ్రిటీషర్స్ సైనికులు వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్న సమయంలో బ్రాహ్మణుడి గెటప్లో ప్రభాస్ వచ్చి వారిని కాపాడే సన్నివేశాన్ని ఇటీవల చిత్రీకరించినట్లు సమాచారం.

అప్పుడు అదే హైదరాబాదులోని ఆర్ ఎఫ్ సి (రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) లో భారీ యాక్షన్ సీక్వెన్స్ ను చిత్రీకరిస్తున్నారు. సుమారుగా 3 వారాల పాటు ఇక్కడ షూటింగ్ కొనసాగుతుందని సమాచారం. పైగా ఈ సీక్వెన్స్ సినిమాకే హైలైట్ గా ఉంటుందట. మరి మెట్రోలో సాగే ఈ మూడు వారాల షూటింగు ప్రేక్షకులను ఏ విధంగా ఆకట్టుకుంటుందో చూడాలి. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో నవీన్ ఎర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2026 డిసెంబర్ 3వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, భానుచందర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దేశభక్తి గాథకు, సాంప్రదాయానికి పెద్ద పీట వేసే చిత్రంగా ఈ చిత్రం రూపొందుతోంది. ఇకపోతే ఇటీవల పోస్టర్ ను విడుదల చేస్తూ.." అజ్ఞాత పర్వం ముగిసింది. తిరుగుబాటు మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా 2026 డిసెంబర్ 3న ఘనంగా విడుదల కాబోతోంది" అంటూ పోస్టర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఇందులో ప్రభాస్ రక్తంతో తడిసిపోయి మెడలో జంధ్యం వేసుకొని చేతిలో రైఫిల్ పట్టుకొని ఒక రాయిపై కూర్చొని కనిపిస్తున్నారు. ఆయన చుట్టూ నేలపై అనేక మృతదేహాలు పడి ఉన్నాయి. ఒంటరిగా పోరాడే ఒక బెటాలియన్ అనే వాక్యం కూడా పోస్టర్ పై ఉండడం గమనార్హం. మొత్తానికి అయితే భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965